

వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలి

వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం, జూలై 21 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): భద్రాచలం వద్ద గోదావరి పెరుగుతన్నందున జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్‌లకు మంత్రి సూచించారు. భద్రాచలం వద్ద స్లూయిస్‌నుంచి నీరురాకుండా గేట్లు పటిష్టంగా ఉంచాలన్నారు. అవసరమైనచోట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు.

వరద గోదారి

- భద్రాద్రి వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక దాటిన ప్రవాహం
- నీట మునిగిన స్నాన ఘట్టాలు
- నేడు రెండో ప్రమాద హెచ్చరికకు చేరే అవకాశం
- భద్రాద్రి చేరుకున్న ఎన్డీఆర్ఎఫ్ బృందం



భద్రాచలం వద్ద గోదావరి ఉధృతి

భద్రాచలం, జూలై 21: గతవారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో భద్రాచలం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. శనివారం రాత్రి 35.7 అడుగులున్న గోదావరి నీటి మట్టం క్రమేపీ పెరుగుతూ ఆదివారం రాత్రి 6.51 గంటలకు తొలి ప్రమాద హెచ్చరిక (43 అడుగులు)ను చేరడంతో భద్రాచలం ఆర్డీవో దామోదర్‌రావు మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. రాత్రి 11గంటలకు 44.8అడుగులకు చేరుకుంది. వరద మరింత పెరిగి సోమవారం రెండో ప్రమాద హెచ్చరికకు చేరే అవకాశాలున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో నదీ పరివాహక ప్రాంతంలోని అన్ని మండలాలకు చెందిన వివిధ శాఖల అధికారులను భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్ అప్రమత్తం చేశారు. ఇంద్రావతితో పాటు ఎగువ ప్రాంతం నుంచి భారీ వరద వస్తుండడంతో భద్రాచలంలోని గోదావరి స్నాన ఘట్టాలు నీట మునిగాయి. దుమ్ముగూడెం మండలం పర్ణశాలలో సీతమ్మ నార చీరల ప్రాంతం ముంపునకు గురైంది. దీంతో గోదావరి నదీ పరివాహక ప్రాంతంలో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా అధికారులు గజఈతగాళ్లను సిద్ధం చేశారు. ఇప్పటికే భద్రాచలంలలోని సబ్‌కలెక్టర్, ఐటీడీఏ పీవో కార్యాలయాల్లో కంట్రోల్ రూంలను ఏర్పాటు చేశారు. కొత్తగూడెం కలెక్టరేట్‌లో 08744-241950, 9392919743, ఐటీడీఏలో 7995268352, సబ్‌కలెక్టర్ ఆఫీస్‌లో 08743-232444, 7981219425లకు అత్యవసర పరిస్థితుల్లో ఫోనుచేసి సాయం పొందవచ్చని సూచించారు.

ఇప్పటికే భద్రాద్రి చేరుకున్న ఎన్డీఆర్ఎఫ్ బృందం

గోదావరి వరదల నేపథ్యంలో గత కొన్నేళ్లుగా నదీ పరివాహక ప్రాంతవాసులకు సేవలందిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందం ఈ సీజన్‌లో సైతం తమ సేవలను అందించేందుకు ఇప్పటికే భద్రాద్రి చేరుకుంది. ఏపీలోని కృష్ణా జిల్లాకు చెందిన 10వ ఎన్డీఆర్ఎఫ్ బెటాలియన్‌కు చెందిన ఇన్‌స్పెక్టర్ భూపేంద్రకుమార్ నేతృత్వంలో 34 మంది సభ్యుల ఈ బృంద భద్రాచలంలో అత్యవసర సమయంలో సేవలందించేందుకు సిద్ధంగా ఉంది. గోదావరి నదీ పరివాహక ప్రాంతంలోని చర్ల, దుమ్ముగూడెం మండలాల ముంపు ప్రాంతాల ప్రజలు సమీపంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు వచ్చేందుకు ఫ్లడ్ డ్యూటీ అధికారులకు సహకరించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ కోరారు.

పునరావాస కేంద్రాలకు వచ్చేందుకు సహకరించాలి

భద్రాద్రి కలెక్టర్ జితేష్ పాటిల్

గోదావరి నదీ పరివాహక ప్రాంతంలోని చర్ల, దుమ్ముగూడెం మండలాల ముంపు ప్రాంతాల ప్రజలు సమీపంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు వచ్చేందుకు ఫ్లడ్ డ్యూటీ అధికారులకు సహకరించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ కోరారు. గోదావరికి ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరదతో గంట గంటకు నీటిమట్టం వేగంగా పెరుగుతోందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముంపునకు గురయ్యే ప్రాంతాల ప్రజలు జాప్యం చేయకుండా పునరావస కేంద్రాలకు రావాలన్నారు. ఎవ్వరూ వాగులు వంకలు దాటే ప్రయత్నం చేయవద్దని, అత్యవసరమైతే కంట్రోల్‌రూం ఫోను చేయాలన్నారు. ఏదైనా ప్రమాదం ఏర్పడితే అధికారులకు తెలియజేయాలన్నారు. జలాశయాల వద్ద ప్రజలు రాకుండా పటిష్ట నియంత్రణ చేయాలన్నారు. వరద నిలిచిన రహదారుల్లో రవాణా నియంత్రణకు ట్రాక్టర్లు అడ్డుపెట్టలని అధికారులను ఆదేశించారు.





ఏడాదిలోగా పెదవాగు పునరుద్ధరణ

- పంట నష్టపోయిన రైతులకు పరిహారం
- ఇల్లు కోల్పోయినవారికి ఇల్లిస్తాం
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- పెదవాగు ప్రాజెక్టు, వరద ప్రభావిత ప్రాంతాల పరిశీలన
- తమను ఆదుకోవాలని బాధితుల వేడుకోలు
- ప్రాజెక్టు వద్ద అధికారులతో మంత్రి సమీక్ష
- ప్రమాద కారణాలపై నివేదిక ఇవ్వాలని కలెక్టర్‌కు ఆదేశం

అవసరమైతే మరో మూడు గేట్లు పెంచుతాం

ఖమ్మం, జూలై21(ఆంధ్రజ్యోతిప్రతినిధి)/అశ్వారావుపేట: రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన పెదవాగు ప్రాజెక్టును రీడిజైన్ చేసి ఏడాదిలోగా మరమ్మతు పనులు పూర్తిచేస్తామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టును గోదావరి వాటర్‌మేనేజ్‌మెంట్ బోర్డు పర్యవేక్షిస్తున్నందున ఏపీ ప్రభుత్వంతో మాట్లాడి ఉమ్మడిగా పనులు పూర్తిచేస్తామని తెలిపారు. అవసరమైతే ప్రాజెక్టుకు మరో మూడు గేట్లు పెంచుతామని తుమ్మల పేర్కొన్నారు. పెదవాగు ప్రాజెక్ట్ గండి కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకుంటామన్నారు. ఇటీవల కురిసిన భారీవర్షాలు, వరదలతో గండిపడ్డ అశ్వారావుపేట మండలం పెదవాగు ప్రాజెక్టును ఆదివారం అధికారులతో కలిసి మంత్రి సందర్శించారు. ప్రాజెక్టుకు గండిపడిన విధానం, జరిగిననష్టాన్ని మంత్రి పరిశీలించారు. అనంతరం గుమ్మడివల్లి, కొత్తూరు, రంగాపురం, నారాయణపురంలోని వరదబాధిత గ్రామాల ప్రజలతో మట్లాడారు. ఈ సందర్భంగా ప్రాజెక్టుకు గండి పడడానికి కారణాలను వారు మంత్రికి వివరించారు. అనంతరం మంత్రి తుమ్మల భద్రాద్రి కలెక్టర్ జితేష్ పాటిల్, ఎస్పీ రోహత్‌రాజ్‌తో పాటు వ్యవసాయ పంచాయతీ, ఆర్‌అండ్‌బీ తదితర శాఖల అధికారులతో సమీక్షించారు. పెదవాగు ప్రాజెక్టు గండి పడడానికి కారణాలపై నివేదిక ఇవ్వాలని కలెక్టర్‌ను మంత్రి తుమ్మల ఆదేశించారు.

ఇరిగేషన్‌శాఖ అధికారులపై మంత్రి ఆగ్రహం

ఒక్కొక్క శాఖనుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నీటిపారుదల శాఖ సీఈ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఏపీనుంచి ఒక్కసారిగా భారీగా వరద రావడంతో ప్రాజెక్టు కట్ట దెబ్బతిన్నట్లు తెలిపారు. అయితే జూలైలో ప్రాజెక్టును ఎందుకు తనిఖీ (మిగతా 6వ పేజీలో)



మణుగూరు మండలం విఠల్‌రావునగర్‌లో కూలిన రేకుల ఇల్లు

వదలని ముసురు

- ఇరు జిల్లాల్లో కొనసాగుతున్న వర్షాలు
- పలుచోట్ల పొంగి ప్రవహిస్తున్న వాగులు

ఖమ్మం/కొత్తగూడెం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మంజిల్లాలో ఆదివారం ముసురు కొనసాగింది. గడిచిన ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఇరుజిల్లాల్లోని పలు ప్రాంతాల్లో అంతర్గత రోడ్లు బురదమయమయ్యాయి. చెరువులు, చిన్న, మధ్యతరహా ప్రాజెక్టులకు వరద నీరు చేరి జలకళను సంతరించుకున్నాయి. ఖమ్మం జిల్లాలో ఆదివారం ఉదయం నుంచి ఒక సెంటీమీటర్ లోపే వర్షపాతం నమోదైంది. భద్రాద్రి జిల్లా చర్ల మండలం సత్యనారాయణపురంలో 6.3సెంమీ, దుమ్ముగూడెంలో 2.98, మణుగూరులో 2.6, భద్రాచలంలో సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద 2.2, భద్రాచలం పట్టణంలో 1.9, ఆళ్లపల్లిలో 1.78, బూర్గంపాడులో 1.6 సెంమీ, గుండాలలో 1.45, ఇల్లెందులో 1.3 సెంమీ వర్షపాతం నమోదైంది. మిగిలిన ప్రాంతాల్లో ఒక సెంమీ లోపే వర్షపాతం నమోదైనా నిరంతరం ముసురు కొనసాగడంతో ప్రజల సాధారణ పనులకు ఆటంకాలు ఏర్పడ్డాయి. పాల్వంచలోని కిన్నెరసాని ప్రాజెక్టు 403అడుగులకు చేరడంతో 3గేట్లు ఎత్తి నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. భద్రాచలం వద్ద గోదావరి మొదటి ప్రమాద హెచ్చరిక(43అడుగులు)ను దాటి ప్రవహిస్తోంది. చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టు 25గేట్లు ఎత్తి నీటిని కిందికి వదులుతున్నారు. ఈ ప్రాజెక్టుకు ఛత్తీస్‌గఢ్ ప్రాంతాలనుంచి భారీగా వరద పోటెత్తుతోంది. గత ఐదు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు సింగరేణి ఓసీల్లో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. సుమారు 1.50లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. వర్షపు నీటిని పైపులైన్ల ద్వారా బయటకు పంపింగ్ చేయిస్తున్నారు.



నాయకన్‌గూడెం వద్ద ఇన్‌ఫాల్ గేట్ల వద్ద సాగర్ జలాల రాకను పరిశీలిస్తున్న అధికారులు

పాలేరుకు సాగర్ జలాలు

పరిశీలించిన ఇరిగేషన్, భగీరథ అధికారులు

కూసుమంచి, జూలై 21: పాలేరు జలాశయానికి సాగర్ జలాల ఇన్‌ఫ్లో స్వల్పంగా పెరిగింది. తాగునీటి అవసరాల కోసం ప్రభుత్వం సాగర్ నుంచి 4వేల క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్న సంగతి తెలిసిందే. ఎడమకాల్వ పరిధిలోని 42కిలోమీటర్ పెద్ద దేవరపల్లి జలాశయానికి 4వేలు క్యూసెక్కులు వెళతుండగా అక్కడినుంచి పాలేరుకు 3వేలు క్యూసెక్కులు వదులుతున్నారు. దీంతో ఆదివారం రాత్రికి పాలేరుకు 1,100 క్యూసెక్కుల నీరు చేరుతోంది. పాలేరు జలాశయం నీటిమట్టం 23 అడుగులకు గాను ప్రస్తుతం 5.7అడుగుల మేర నీటి నిల్వ ఉంది. సోమవారం నుంచి నీటిమట్టం పెరిగే అవకాశం ఉందని ఐబీ అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో నాయకన్‌గూడెం వద్ద ఎడమకాల్వలో సాగర్ జలాల ప్రవాహాన్ని నీటిపారుదలశాఖ ఈఈ మంగళపూడి వెంకటేశ్వరరావు, భగీరథ ఈఈ ప్రమీల పరిశీలించారు. ఈ సందర్భంగా పాలేరుకు ఎంతనీరు చేరుతున్నదో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

ఆటోను ఢీకొట్టిన కారు

- ఇద్దరు మృతి.. నలుగురికి తీవ్రగాయాలు
- వైద్యం కోసం వచ్చి వెళ్తుండగా ప్రమాదం
- ఖమ్మం జిల్లా జగన్నాథపురం వద్ద ఘటన
- మృతులు ఏపీలోని ఎన్‌టీఆర్ జిల్లా వాసులు

7

చేపల వేటకు వెళ్లి

వ్యక్తి గల్లంతు

- ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలతో గాలింపు
- పరిస్థితిని సమీక్షించిన భద్రాచలం ఆర్డీవో

దమ్మక్కకు గిరిజన నీరాజనం

- భద్రాచలంలో ఘనంగా సేవాయాత్ర
- వైభవంగా గిరిప్రదక్షిణ, దమ్మక్కకు ప్రత్యేక పూజలు
- ఆర్.కొత్తగూడెంలో ఘనంగా సీతారాముల కల్యాణం
- వర్షంలోనూ భారీగా తరలివచ్చిన భక్తులు



భద్రాద్రిలో దమ్మక్క విగ్రహానికి పూజలు

భద్రాచలం/చర్ల జూలై 21: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఆదివారం దమ్మక్క సేవాయాత్ర, గిరి ప్రదక్షిణ వైభవంగా నిర్వహించారు. ముందుగా భద్రాద్రి దేవస్థానం ఆధ్వర్యంలో గిరిప్రదక్షిణ నిర్వహించి పోకల దమ్మక్క విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చర్ల మండలంలోని ఆర్.కొత్తగూడెం గ్రామంలోని రామాలయంలో శ్రీ సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం వివిధ రకాల పుష్పాలు, ఫలాలను తెచ్చిన గిరిజనులు భద్రాద్రి దేవస్థానంలో మేళతాళలు, వేదపండితుల మంత్రోచారణల నడుమ స్వామివారికి నివేదన చేశారు.

రామయ్య కళ్యాణం తిలకించిన గిరిజనం

చర్ల మండలంలోని ఆర్.కొత్తగూడెం గ్రామంలో నిర్వహించిన రామయ్య కల్యాణంను తిలకించేందుకు గిరిజనులు భారీగా తరలివచ్చారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా వచ్చి తమ ఆరాధ్య దైవమైన భద్రాద్రి రామయ్య కల్యాణంను కనులార తిలకించారు. ఏజెన్సీలోని గిరిజనులు తొలిసారిగా భద్రాచలం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన దమ్మక్క సేవాయాత్రలో పాల్గొనడానికి వచ్చి తిలకించి పులకించారు. ఈ సందర్భంగా ఎనిమిది మంది గిరిజన ముత్తైదువలకు అమ్మవారి చీర, పసుపు కుంకుమ, స్టీలు బాక్సు లడ్డూ ప్రసాదం, స్వామి వారి చిత్రపటం దేవస్థానం తరపున అందజేశారు. ఇదిలా ఉండగా రామయ్య కల్యాణంను తిలకించడానికి వచ్చిన వెయ్యి మంది భక్తులకు అన్న ప్రసాదంను దేవస్థానం అందజేసింది. ఈ కార్యక్రమాల్లో దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, ఏఈవో భవానీరామకృష్ణ, పర్యవేక్షకులు నిరంజన్‌కుమార్, కత్తి శ్రీనివాస్, లింగాల సాయిబాబా, జూనియర్ అసిస్టెంటు రాకేష్, ఏఈ అజయ్, సాగర్, రామనర్సయ్య, శివ, దేవస్థానం ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, ఉప ప్రధాన అర్చకులు కోటి రామస్వరూప్ రాఘవాచార్య, అమరవాది గోపాలకృష్ణమాచార్యులు, ముఖ్య అర్చకులు కోటి విష్ణువర్ధనాచార్యులు, అర్చకులు అమరవాది శ్రీకాంతాచార్యులు, వేద పండితులు చిట్టి హనుమత్‌శాస్త్రి, శ్రీరామ పారాయణదారులు ఎస్టీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు, ఆదివాసీ కొండరెడ్ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ముర్ల రమేష్‌రెడ్డి, పూనెం కృష్ణదొర, సర్వేశ్వరరావు, ఇందల రమేష్, ఇందల బుచ్చిబాబు, కలగర రామకృష్ణ, పుల్లయ్య పాల్గొన్నారు.



ఆషాడమాసాన్ని పురస్కరించుకొని ఇరు జిల్లాల్లో పలుచోట్ల బోనాల వేడుకను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జూలూరుపాడు కోటమైసమ్మతల్లికి బోనం చెల్లించడానికి బయలుదేరిన మహిళలు

- జూలూరుపాడు



బాధ్యతలు స్వీకరిస్తున్న రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయబాబు

ఇరిగేషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా మువ్వా బాధ్యతల స్వీకరణ

- అభినందించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- జిల్లా నుంచి తరలిన కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు

ఖమ్మం సంక్షేమ విభాగం, జూలై 21: రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా మువ్వా విజయబాబు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా నుంచి భారీగా కాంగ్రెస్ శ్రేణులు, ఆయన అభిమానులు హైదరాబాద్‌కు తరలివెళ్లారు. ప్రమాణ స్వీకారం సందర్భంగా రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మువ్వాను అభినందించారు. ఎంపీ రామసహాయం రఘురామరెడ్డి, ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, మట్టా రాగమయి, జారే ఆదినారాయణ, తెల్లం వెంకట్రావు, వేముల వీరేశం, యరపతినేని శ్రీనివాసరావు సమక్షంలో మువ్వా విజయబాబు బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, మాజీ ఎంపీ రామసహాయం సురేందర్‌రెడ్డి, మాజీ మంత్రి సంబాని చంద్రశేఖర్, తుళ్లూరి బ్రహ్మయ్య, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, జేబీ స్వర్ణకుమారి, తుంబూరి దయాకర్‌రెడ్డి, కొప్పుల చంద్రశేఖర్, పిడమర్తి రవి, టీజీవో రాష్ట్ర కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు, బోర్రా రాజశేఖర్, జంషం రాఘవారెడ్డి తదితరులు మువ్వా విజయ్‌బాబును అభినందించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం మువ్వా విజయ్‌బాబు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ఒక రైతు బిడ్డగా డీసీసీబీ చైర్మన్‌గా పనిచేసిన అనుభవంతో అత్యంత కీలకమైన ఇరిగేషన్ కార్పొరేషన్ చైర్మన్ బాధ్యతలు నిర్వహిస్తానన్నారు. ఇరిగేషన్‌శాఖ మంత్రి ఉత్తమకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇరిగేషన్ వ్యవస్థను ప్రక్షాళన చేస్తామన్నారు. ఉమ్మడి జిల్లాలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు సూచనలు, సలహాలతో నీటి పారుదల అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు.


తాలిపేరు ప్రాజెక్టు నుంచి నీటి విడుదల దృశ్యం

తాలిపేరు ప్రాజెక్టుకు పెరుగుతున్న ఇన్‌ఫ్లో

» 25 గేట్ల ద్వారా 69,520 క్యూసెక్కుల నీరు విడుదల

చర్ల, జూలై 21: ఛత్తీస్‌గఢ్‌తో పాటు చర్ల మండలంలో కురుస్తున్న వర్షాలకు తాలిపేరు ప్రాజెక్టు నిండుకుండగా మారింది. ఆదివారం ప్రాజెక్టు గేట్లు పూర్తిగా ఎత్తివేశారు. ఉదయం ఇన్‌ఫ్లో కాస్త తగ్గుముఖం పట్టినప్పటికీ సాయంత్రం ఇన్‌ఫ్లో పెరిగింది. ఆదివారం సాయంత్రం 25 గేట్ల ద్వారా 69,520 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు ప్రస్తుత నీటి మట్టం 71.18 మీటర్లు కాగా ఇన్‌ఫ్లో 72,228 క్యూసెక్కులుగా ఉంది.


కిన్నెరసానికి జలకళ

వరద ప్రవాహంతో నిండిన కిన్నెరసాని

» జలాశయంలో 403 అడుగులకు చేరిన నీటి మట్టం.. ఐదుగేట్ల ఎత్తివేత

పాల్వంచ రూరల్, జూలై 21: కిన్నెరసానికి వరద పోటెత్తింది. ఆదివారం నీటిమట్టం 403 అడుగులకు చేరింది. ఎగువ ప్రాంతం నుంచి వరదనీటి ప్రవాహం పెరుగుతోంది. ఇన్‌ఫ్లో 16వేల క్యూసెక్కుల చొప్పున చేరుతుండటంతో ప్రాజెక్టు అధికారులు ఐదు గేట్లు ఎత్తారు. పాల్వంచ, బూర్గంపాడు మండలంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. వాగులు దాట వద్దని మైకు ప్రచారం ద్వార కిన్నెరసాని జలాశయం అధికారులు హెచ్చరికలు జారీచేశారు.


వైరా రిజర్వాయర్

11.3అడుగులకు చేరిన వైరా నీటిమట్టం

» నేడు స్వల్పంగా పెరిగే అవకాశం

వైరా, జూలై 21: వైరా రిజర్వాయర్ నీటిమట్టం ఆదివారం సాయంత్రానికి 11.3అడుగులకు చేరుకుంది. రిజర్వాయర్ క్యాచ్‌మెంట్ ఏరియాలో శనివారం రాత్రి వర్షాలు లేక వచ్చే వరద ఉధృతి తగ్గిపోయింది. దాంతో 10.6అడుగులుగా ఉన్న నీటిమట్టం 11.3అడుగులకు మాత్రమే చేరుకుంది. సోమవారానికి ఈ నీటిమట్టం స్వల్పంగా పెరిగే అవకాశముందని నీటిపారుదలశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

సింగరేణిపై వరుణ ప్రభావం

» బొగ్గు ఉత్పత్తి,ఉత్పాదకతకు ఆటంకం

» చిత్తడిగా గనుల్లో అంతర్గత రహదారులు...

» విధులకు హాజరయ్యే కార్మికులకు ఇక్కట్లు..

మణుగూరుటౌన్, జూలై 21: బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కురుస్తోన్న వర్షాలు వరుసగా మూడవ రోజుకూడా ఎడతెరిపి లేకుండా కురిసింది. శనివారం రాత్రి ప్రారంభమైన వర్షం ఆదివారం సాయంత్రం వరకు భారీగానే కురుస్తోంది. దీంతో ఏరియాలోని సింగరేణి గనుల్లో బొగ్గు ఉత్పత్తితోపాటు ఓబీ వెలికితీత పనులు నిలిచిపోయాయి. రోజు వారి బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు భారీ స్థాయిలోనే గండి పడింది. ఏరియాలోని ఆఫ్‌లోడింగ్ కంపెనీలతో పాటు సింగరేణి సంస్థ మట్టిని(ఓబీ) వెలికితీసేపనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. గనుల్లో నుంచి బొగ్గును వెలికితీసే డంపర్‌లు, స్కానియాలు, ఓల్వోలు ఆయా కంపెనీల గ్యారేజీల్లోనే నిలిచిపోయాయి.

విధులకు హజరయ్యే కార్మికులకు ఇక్కట్లు..

సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని పీకేఓసీ-2, కేపీయుజీ, ఓసీ-4 గనుల్లో కార్మికులు విధులకు హాజరయ్యేందుకు చెప్పుకోలేని ఇక్కట్లు పడుతున్నారు. ఇంటి నుంచి బయలుదేరిన కార్మికుడు విధులు నిర్వహించే గమ్యస్థానానికి చేరుకోవాలంటే సర్కస్ ఫీట్లు చేయాల్సిన పరిస్థితి నెలకొందని కార్మికులు, కార్మిక నాయకులు వాపోతున్నారు. ఏరియాలోని ఏరియా స్టోర్స్‌కు సమీపంలో రైల్వే అండర్ బ్రిడ్జీ కింద చెరువులను తలపించేల నిలిచిన వరదనీటి నుంచి ప్రారంభమయ్యే కష్టాలు ఓసీ-2 నూతన సైట్ కార్యాలయం, కేపీయుజీ గనులకు చేరుకునే వరకు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని పోవాల్సిన పరిస్థితి నెలకొందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నూతన సైట్ కార్యాలయంలో ఎస్అండ్‌డీ సెక్షన్‌కు వెళ్లాలన్న ఇదే పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. కార్యాలయ ఆవరణ అసాంతం బురదమయమై విధులకు హాజరైన కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తోందని కార్మిక నేతలు వాపోతున్నారు. గనుల్లో అంతర్గత రహదారులు చిత్తడిగా మారి వాహనాలు జారీ పోయే పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏరియా అధికారులు ఇప్పటికైన రహదారులను శుభ్రం చేసి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.


భారీ వర్షాలతో నిర్మానుష్యమైన పీకేఓసీ-2


ఎక్కడివి అక్కడే నిలిచిపోయిన భారీ వాహనాలు

రహదారులపైనే బొగ్గు..

ఓసీ గనుల నుంచి భారీ వాహనాల ద్వారా తరలించే బొగ్గు సింగరేణి రహదారులపైనే ఉంటోందని కార్మికులు వాపోతున్నారు. తద్వారా రాత్రి సమయాల్లోను, వర్షం కురిసిన సమయాల్లో రహదారులు జారుతు కార్మికులకు ఇబ్బంది కలిగిస్తోందని ఆవేదనవ్యక్తం చేస్తున్నారు. భారీ స్థాయిలో బొగ్గు రోడ్లపై పడి సంస్థకు నష్టం వాటిల్లుతున్న అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైన కార్మికులు వినియోగించే రహదారులపై బొగ్గును తొలగించాలని, వాహనాల్లో రోడ్లపై బొగ్గు పడిపోకుండ జగ్రాత్తలు తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు. బొగ్గుఉత్పత్తికి జరిగిన ఆటంకంపై ఫోన్‌లో వివరణ కోరేందుకు ప్రయత్నించగా అధికారులు అందుబాటులోకి రాలేదు.


రాకపోకలకు ఆటంకంగా రహదారిపై బొగ్గు


నారచీరల వద్ద ముంపునకు గురైన దుకాణాలు

ముంపులోనే పర్ణశాల నారచీరలు

దుమ్ముగూడెం, జూలై 21: ప్రముఖ పుణ్యక్షేత్రం పర్ణశాల నారచీరల ప్రాంతం రెండోరోజైన ఆదివారం సైతం ముంపులోనే ఉంది. సీతవాగు ఉధృతి, గోదావరి బాక్ వాటర్ పోటుతో ఆ ప్రాంతంలో దుకాణాలు సైతం మునిగిపోయాయి. పర్ణశాల స్నానఘట్టాల వద్దకు వరదనీరు చేరుకుంది. సున్నంబట్టి-భైరాగులపాడుల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కెలక్ష్మీపురం వద్ద ముంపుకు గురైన ప్రాంతాన్ని ఆర్డీవో దామోదరావు సందర్శించారు. మారాయిగూడెం వద్ద చెరువు వరసగా రెండోరోజు సైతం పొంగిపొర్లడంతో ప్రధాన రహదారిపై రాకపోకలకు అంతరాయం కొనసాగుతోంది.

పర్ణశాల స్నానఘట్టాలకు చేరుకున్న వరదనీరు


ఏడాదిలోగా 'పెద్దవాగు' పునరుద్ధరణ

(5వ పేజీ తరువాయి)

చేయలేదని నీటిపారుదశాఖ మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి విపత్తుల సమయంలో సెల్‌ఫోన్ మేసేజ్‌లతో కాకుండా నేరుగా ఫోన్‌లో ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చిన సమస్యను తెలపాలన్నారు. ఎంతసేపటికీ వరలో చిక్కుకున్న వారిగురించే చెప్పారు తప్ప ప్రాజెక్టు కట్టపైనుంచి నీరు ప్రవహిస్తున్న విషయం ఎందుకుచెప్పలేదన్నారు. దీనిపై విచారణ చేపట్టి సమగ్ర నివేదిక ఇవ్వాలని కలెక్టర్ జితేష్ వీ. పాటిల్‌ను ఆదేశించారు. రెవెన్యూశాఖ సమీక్షలో కొత్తగూడెం ఆర్డీవో మట్లాడుతూ గుమ్మడివల్లి, కొత్తూరు, అనంతారంలకు చెందిన 750మందిని సురక్షిత ప్రాంతానికి తరలిచి వారికి భోజన ఏర్పాట్లుచేశామన్నారు. కుటుంబానికి 10కేజీల బియ్యం పంపిణీ చేస్తున్నామని తెలపగా కేజీ కందిపప్పు, నూనెప్యాకెట్లు, కూరగాయలు కూడా అందించాలని మంత్రి తెలిపారు. పెదవాగు ప్రాజెక్టు వరదతో 120ఎకరాల్లో వరినారుమళ్లు 65 ఎకరాల్లో వరి కొట్టుకుపోయినట్లు వ్యవసాయశాఖ అధికారులు తెపారు. పత్తి, ఆయిల్ పామ్ తదితర పంటలు దెబ్బతిన్నాయన్నారు. పంటల నష్టంపై పూర్తి స్థాయి సర్వే నిర్వహించాలని మంత్రి సూచించారు. వరద పోటెత్తిన గ్రామాల్లో అంటువ్యాదులు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, జ్వరాలు రాకుండా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని వైద్యశాఖ అధికారులను మంత్రి ఆదేశించారు.

అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ గోదావరి బోర్డు పర్యవేక్షణలో ఉన్న పెదవాగు ఆయకట్టు 80శాతం ఏపీ, 20శాతం తెలంగాణలో ఉందన్నారు. ఇదే నిష్పత్తిలో మరమ్మతులకు నిధులు కేటాయించాల్సి ఉందన్నారు. గత ఐదేళ్లుగా ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు ఈ ప్రాజెక్టు మరమ్మతుల విషయంలో నిధుల కేటాయింపులో నిర్లక్ష్యంగా వ్యవహరించాయని తుమ్మల తెలిపారు. జరిగిన నష్టాన్ని గోదావరి బోర్డుకు తెలిపి బోర్డు అధికారుల సూచనల మేరకు మరో మూడు గేట్లను పెంచి 80వేల క్యూసెక్కుల వరద వచ్చినా ఇబ్బంది లేకుండా కట్టను బలోపేతం బలోపేతం చేస్తామన్నారు. ఒక్కసారిగా వచ్చినా అదృష్టవశాత్తు 31మందిని వరద నుంచి సకాలంలో కాపాడగలిగామన్నారు. భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రోహిత్‌రాజ్ చొరవ, ముందుచూపుతో హెలికాపటర్ సాయంతో వారి ప్రాణాలు రక్షించామని మంత్రి వివరించారు. అలాగే వరద సమయంలో భద్రాద్రి కలెక్టర్ జితేష్ పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్, ఐటీడీఏ పీవో రాహుల్ ఇతర అధికారులు సమయస్ఫూర్తితో పనిచేశారన్నారు. వాస్తవానికి ఎగువున ఉన్న వరద అంచనా వేసి మూడు గేట్లు ఎత్తితే ఇంత ప్రమాదం జరిగి ఉండేది కాదన్నారు. 1989లో కూడా ఈ ప్రాజెక్టుకు ఒకసారి గండిపడిందన్నారు. అప్పట్లో తాను చొరవ తీసుకుని ఈ ప్రాజెక్టుకు మూడు గేట్లు ఏర్పాటు చేశానన్నారు. గండి పడి ఆకస్మికంగా వచ్చిన వరదతో రైతులు దారుణంగా నష్టపోయారన్నారు. జరిగిన నష్టంపై ముఖ్యమంత్రితో చర్చించి రైతులను అన్ని విధాల ఆదుకుంటామని హామీ ఇచ్చారు. పంటల నష్ట పరిహారం ఇచ్చేందుకు త్వరగా సర్వే పూర్తిచేయిస్తామని తెలిపారు. వర్షాలు, వరదలో దెబ్బతిన్న ఆర్అండ్‌బీ, పీఆర్, విద్యుత్‌శాఖలకు జరిగిన నష్టాన్ని అంచనా వేస్తున్నామని, తక్షణ మరమ్మతులకు చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. తాను ఈ ప్రాంతంలో ప్రతి ఊరు, ప్రతి గూడెం తిరిగిన వాడిని, ఆ అనుబంధంతోనే ఇక్కడ వరద వచ్చి ప్రజలు ఇబ్బంది పడ్డారని తెలిసి తల్లడిల్లిపోయానన్నారు. అందుకే జరిగిన నష్టాన్ని ప్రత్యక్షంగా తిలకించేందుకు వచ్చినట్లు తెలిపారు. సమావేశంలో భద్రాద్రి కలెక్టర్ జితేష్ వీ. పాటిల్, ఎస్పీ రోహిత్ రాజ్, ఐటీడీఏ పీవో రాహుల్, ఇరిగేషన్ ఎస్ఈ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. వరదలతో కొత్తూరులో ముంపున గురైన పంచాయతీ విద్యుత్ మోటారుకు మరమ్మతులు చేసేందుకు వెళ్లి విద్యుదాఘాతంతో మరణించిన చాపర్ల వేణు మురళి కుటుంబాన్ని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందన్నారు. అనంతరం గుమ్మడివల్లి తదితర గ్రామాల్లో ఇసుక మేటలు వేసిన వరిపొలాలు, ఆయిల్‌పామ్ తోటలను మంత్రి తుమ్మల పరిశీలించారు.


దెబ్బతిన్న ఇంటిని పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల


బాధితులకు భరోసా కల్పిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఎస్పీ రోహిత్‌రాజ్‌కు మంత్రి తుమ్మల ప్రశంసలు

పెదవాగు ప్రాజెక్టుకు గండి పడిన విషయం తెలుసుకొని సకాలంలో స్పందించి సహాయక చర్యలు చేపట్టిన భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రోహిత్ రాజ్‌ను విలేకరుల సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం తరుపున మంత్రి తుమ్మల ప్రశంసించారు సాయంత్రం 4గంటలకు వరద వస్తున్న సమాచారం అందగానే ఆయన సకాలంలో పెదవాగు ప్రాజెక్టు వద్దకు చేరుకొని భద్రాద్రి కొత్తగూడెం, ఏలూరు జిల్లా అధికారులకు సమాచారం ఇచ్చి సమన్వయం చేసుకుని సకాలంలో హెలికాప్టర్ తెప్పించడం ద్వారా 31మంది ప్రాణాలు కాపాడగిలిగామన్నారు. హెలీకాప్టర్ అరగంట ఆలస్యమైనా వీరి ప్రాణలకు ముప్పవాటిల్లేదన్నారు. వరదలు, వర్షాల సమయంలో అధికారులు ఎవరైనా సంఘటనాస్థలానికి చేరితే ఎలాంటి విపత్తులైనా ఎదుర్కోవచ్చని, ఇందుకు ఎస్పీ రోహిత్‌రాజ్ చూపిన చొరవ నిదర్శనమన్నారు. ప్రభుత్వం తరుపున ఎస్పీకి అభినందనలు తెలిపారు. పెద్దవాగు విపత్తు సహాయక చర్యల్లో భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఐటీడీఏ పీవో రాహుల్ తదితరులు సకాలంలో స్పందించి పనిచేశారని అభినందించారు.

సార్ మీరే మాకు దిక్కు

"సార్ మీరే మాకు దిక్కు.. ఎప్పుడు ఏ వరద వచ్చినా అండగా నిలుస్తున్నారు. సాయం అందిస్తున్నారు.. పెదవాగు గండి పడడంతో సర్వం కోల్పోయాం. ఆదుకోండి" అంటూ పెదవాగు ప్రాజెక్టు గండి కారణంగా నష్టపోయిన వరద బాధితులు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఆదివారం మంత్రి తుమ్మల పెదవాగు ప్రాజెక్టు వద్దకు వస్తున్నారని తెలిసి గుమ్మడవల్లి, కొత్తూరు, నారాయణపురం కోయరంగాపురం తదితర గ్రామాల నుంచి ఇళ్లు, పొలాలు దెబ్బతిన్న బాధితులు మంత్రి తుమ్మల వద్దకు వచ్చి తమ ఆవేదనను తెలిపారు. అనంతరం పొలాల్లో ఇసుక మేటలను, వదరదతో దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల పలువురు మహిళలతో మాట్లాడారు. తమను ఆదుకోవాలని పలువురు మహిళలు తుమ్మల వద్దకు వచ్చి కన్నీటి పర్యంతమయ్యారు. స్పదించిన తుమ్మల ఇళ్లు పడిపోయిన వారికి ఇల్లు ఇస్తామని, వరదలో కాకుండా ఎగువన కట్టుకోవాలని సూచించారు. ఆంధ్రాలోని ఏలూరు జిల్లా వేలేరుపాడు మండల వరదముంపు రైతులు తుమ్మలను కలిసి పెదవాగు ప్రాజెక్టుకు త్వరగా మరమ్మతులు పూర్తిచేసేలా చొరవ తీసుకోవాలని కోరారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

పాఠశాలల్లో శిక్షా సప్తాహ్

» జాతీయ విద్యా విధానం అమల్లోకి వచ్చి నాలుగేళ్లు

» నేటి నుంచి 29 వరకు విద్యా వారోత్సవాలు



ఖమ్మం ఖానాపురం హవేలి, జూలై 21: నూతన విద్య విధానం 2020 అమల్లోకి వచ్చి నాలుగేళ్ల పూర్తైన సందర్భంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 22 నుంచి 29 వ తేదీ వరకు శిక్ష సప్తాహ్ (విద్య వారోత్సవం) నిర్వహిస్తామని జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ ఆదివారం తెలిపారు. జిల్లాలోని ప్రాథమిక పాఠశాలలు 813, ప్రాథమికోన్నత పాఠశాలలు 192, ఉన్నత పాఠశాలలు 230లలో మొత్తం విద్యార్థులు 67వేల229 మంది ఈ కార్యక్రమంలో పాల్గొనేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆయన ఆదేశించారు. ప్రతిరోజు పాఠశాల సాధారణ బోధనకు భంగం కలగకుండా కార్యక్రమాలను తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. పాఠశాలలో ఆయా ఇతివృత్తములపై నిర్వహించిన కార్యక్రమాలకు సంబంధించి జియో ట్యాగ్ చిత్రాలను, వీడియోలను నిర్దేశించిన గూగుల్ డ్రైవ్‌లో అప్లోడ్ చేయాలని తెలిపారు. పాఠశాల స్థాయిలో కార్యక్రమ నివేదికను రూపొందించి సాఫ్ట్ కాపీని జిల్లా విద్యాశాఖాధికారికి మెయిల్ చేయాలని తెలిపారు. పాఠశాలలో జరుగుతున్న వివిధ కార్యక్రమాలపై అవగాహనా కలిగేలా తల్లిదండ్రులను, దాతలను భాగస్వాములను చేయాలి. తప్పనిసరిగా జియో టాగ్ కలిగిన ఫొటోలను, వీడియోలను పాఠశాల స్థాయి కార్యక్రమ నివేదికను జిల్లాకు అందించాలని తెలిపారు.

రోజువారి వారోత్సవాల వివరాలు

సోమవారం సామగ్రి ప్రదర్శన, మంగళవారం పునాది అభ్యసన, బుధవారం క్రీడా దినోత్సవం, గురువారం సాంస్కృతిక దినోత్సవం, శుక్రవారం సాంకేతిక నైపుణ్యాల దినోత్సవం, శనివారం పర్యావరణ పరిరక్షణ దినోత్సవం, సోమవారం(29వ తేది) సామాజిక భాగస్వామ్య దినోత్సవాలను నిర్వహించాలని డీఈవో సోమశేఖర శర్మ తెలిపారు.

ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ ఆంగ్ల భాష బోధన తరగతులు

ఖమ్మం ఖానాపురంహవేలి, జూలై 21: ఎన్‌సీఈఆర్‌టీ సహకారంతో విల్ టు కెన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లిష్ డైరెక్టర్ రామేశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో జిల్లా ఉపాధ్యాయులకు 40 రోజుల ఉచిత ఆన్‌లైన్ శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో భాగంగా ఒక రోజు ఫిజికల్ క్లాస్ ఆదివారం నగరంలోని మంచి కంటిభవన్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 500 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ హజరై మాట్లాడుతూ ఈ తరగతుల ముఖ్య ఉద్దేశం గవర్నమెంట్ పాఠశాలలలో చదివే ప్రతి విద్యార్థి కూడా తెలుగు మాట్లాడినట్టుగా ఇంగ్లీష్ మాట్లాడేటట్టు చేయటమన్నారు. విల్ టు కెన్ సంస్థ డైరెక్టర్ రామేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ ఇప్పటివరకు తెలంగాణలో 29 జిల్లాల లో 49 వేల మంది ఉపాధ్యాయులకు ఈ తరగతులను పూర్తి చేశామని అన్నారు. ఈ క్లాసులకు సంబంధించిన ఓ పుస్తకాన్ని డీఈవో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగ మల్లేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరావు, పీఆర్‌టీయూ బాధ్యులు చంద్ర శేఖర్, సతీష్ , నెల్లూరి.వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రాచారికి 'ఐకానిక్ పీస్' డాక్టరేట్

» టిబెటన్ డిప్యూటీ స్పీకర్ నుంచి స్వీకరణ

ఖమ్మం కలెక్టరేట్, జూలై 21: ఆయుర్వేదంలో విశిష్ట సేవలు అందించినందుకుగాను ఖమ్మం జిల్లాకు చెందిన రామడుగు వీరభద్రాచారికి ఐకానిక్ పీస్ అవార్డును కౌన్సిల్ న్యూఢిల్లీ డాక్టరేట్ అవార్డును అందజేశారు. టిబెటన్ పార్లమెంట్ డిప్యూటీ స్పీకర్ ఆచార్య యేషి ఫుంట్సోక్ చేతుల మీదుగా వీరభద్ర చారి ఢిల్లీలో శనివారం అందుకున్నారు. శనివారం రాత్రి న్యూఢిల్లీలోని రఫీ మార్గ్ కాన్స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియా రఫీ మార్గ్ లో జరిగిన వేదుకల్లో ఈ అవార్డును ప్రదానం చేశారు. ఖమ్మంలోని వీడియోస్ కాలనీకి చెందిన రామడుగు వీరభద్రాచారి ఆయుర్వేద వైద్యుడిగా నిరుపేద, మధ్యతరగతి వర్గాలకు దాదాపు 430 మందికి సురక్షిత కాన్పుల వైద్యసేవలు అందించినందుకుగాను ఆయనకు ఈ అవార్డు దక్కింది. అలోపతి వైద్యం ద్వారా గ్రామీణ ప్రాంతాలలో పేదలకు వంశపారపర్యంగా వైద్యసేవలను కొనసాగిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి విజయ్ సంప్లా, రాజ్యసభ సభ్యుడు నరేష్ బన్సల్, ఐపీఎస్ అధికారి సచిన్ గుప్తా, నేపాల్ రాష్ట్ర పునర్ స్థాపన మంచ్ బిష్ణు ప్రసాద్ బర్శల్, అంతర్జాతీయ సింగర్ బ్రహ్మ పాల్, ఐకానిక్ పీస్ అవార్డు కౌన్సిల్ చైర్ పర్సన్ సుస్మిత పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


ఢిల్లీలో డాక్టరేట్‌ను అందుకుంటున్న వీరభద్రాచారి

ఏజెన్సీ వైద్యశాలలపై నిర్లక్ష్యమేలా!

▸▸ జిల్లా క్షయ విభాగ ప్రోగ్రామింగ్ అధికారికి బదిలీ ▸▸ కీలక వైద్యుల బదిలీతో రోగుల ఇబ్బందులు

భద్రాచలం, జూలై 21: ఏజెన్సీ డివిజన్ కేంద్రమైన భద్రాచలంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో ఇకపై వైద్యం అందని ద్రాక్షగా మారనుంది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం వివిధ ప్రభుత్వ శాఖల్లో అధికారులకు, ఉద్యోగులకు బదిలీల ప్రక్రియను నిర్వహిస్తోంది. ఈ క్రమంలో భద్రాచలం ఏరియా వైద్యశాలలో పనిచేస్తున్న కీలక వైద్యులను సీనియర్లుగా పరిగణిస్తూ, వివిధ ప్రాంతాలకు బదిలీ చేసింది. అదే విధంగా జిల్లా క్షయ విభాగానికి ప్రోగ్రామింగ్ అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్న వైద్యులను బదిలీ చేశారు. ఏజెన్సీ నుంచి వైద్యులు దీర్ఘకాలంగా పనిచేస్తున్నారని కారణంతో బదిలీ చేశారు తప్పించి, వారి స్థానంలో ఎవరు బాధ్యతలు నిర్వహించేందుకు నియమించకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే భద్రాద్రి ఏరియా వైద్యశాలలో మొత్తం 208 పోస్టుల మంజూరుకు గాను, 71 మం ది రెగ్యులర్‌గా, 23 మంది కాంట్రాక్టు పద్ధతిన, 21 మంది ఔట్‌సోర్సింగ్‌లో పని చేస్తున్నారు. 93 ఖాళీలు ఉన్నాయి.

బదిలీలు ఇలా ..

భద్రాచలం ఏరియా వైద్యశాలలో బాధ్యతలు నిర్వహిస్తున్న పిల్లల వైద్య నిపుణులు ముగ్గురికి బదిలీ అయింది. ఆర్‌ఎంవోగా బాధ్యతలు నిర్వహిస్తున్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి కోదాడకు, మరో ఇరువురు పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ క్రాప విజయ్, సుమన్‌లకు పాల్వంచ, జహీరాబాద్‌కు బదిలీ జరిగింది. అర్థో డాక్టర్ దేవరాజుకు కొత్తగూడెం, డెంటల్ సివిల్ సర్జన్ గిరి ప్రసాద్‌కు తాండూరు, డెంటల్ డాక్టర్ చావా యుగంధర్‌కు మణుగూరు బదిలీ అయ్యింది. అలాగే ఈఎన్‌టీ డాక్టర్ ప్రవీణ్‌కు కొండాపూర్, చర్మవ్యాధుల వైద్యులు మాధురిని వైరాకు బదిలీ అయ్యారు. ఇదిలా ఉండగా జిల్లా క్షయ విభాగం ప్రోగ్రామింగ్ అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్న డాక్టర్ శ్రీనివాస్‌ను హైదరాబాద్‌కు బదిలీ చేశారు. ఇందులో కొంత మంది తమ స్వస్థలాలకు వెళ్లాలని భావించినా, వారి స్థానంలో కూడా ఎవరిని ప్రస్తుతం నియమించని పరిస్థితి ఇక్కడ ఉంది.

మిగిలింది నలుగురు వైద్యులే...

భద్రాద్రి వైద్యశాల నుంచి వైద్యులను దీర్ఘకాలంగా పనిచేస్తున్నారంటూ సాధారణ బదిలీల్లో భాగంగా ఇతర ప్రాంతాలకు బదిలీ చేశారు. ఇంతవరకు బాగానే ఉంది. కానీ ఇక్కడ పనిచేస్తున్న వైద్యులను ఇతర ప్రాంతాలకు బదిలీ చేసిన అధికారులు, వారి స్థానంలో ఇతర వైద్యులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోకపోవడం ఎంతవరకు సమంజసం అనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలోని భద్రాచలం, ఉట్నూరు, ఏటూరు నాగారం ఐటీడీఏల పరిధిలో పనిచేస్తున్న వారు మంచి సేవలు అందిస్తే దీర్ఘకాలంగా పనిచేస్తున్న వారు ఏజెన్సీలో పని చేసేందుకు సుముఖత వ్యక్తం చేస్తే వారి సేవలను ఆ ప్రాంతాల్లోనే వినియోగించుకోనేందుకు చర్యలు చేపట్టాలని ఏజెన్సీ వాసులు కోరుతున్నారు. సాధారణ బదిలీల్లో ఒక్కసారిగా ఇంతమందిని బదిలీ చేయడం వలన, వర్షాకాలంలో అంటు రోగాలు జ్వరాలు వైరల్ ఫీవర్, డెంగ్యూ, మలేరియా తదితర వ్యాధులు వ్యాపించే సమయంలో ఉన్న వైద్యులను పంపించివేస్తే భద్రాద్రి వైద్యశాలలో వైద్యం ఎలా సాధ్యమని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. గతంలో 2018లో ప్రభుత్వం 32 మంది వైద్యులను నేరుగా రిక్రూట్ చేసి భద్రాచలానికి పంపగా, చివరకు మిగిలింది, నలుగురు వైద్యులేనన్న విషయాన్ని ఉన్నతాధికారులు, ప్రభుత్వం గుర్తించాలని భద్రాద్రి వాసులు స్పష్టం చేస్తున్నారు.



వివిధ విభాగాల్లో ఖాళీగా దర్శనమిస్తున్న పోస్టులు..

ఇప్పటికే ఏరియా వైద్యశాలలో సివిల్ సర్జన్ పోస్టులు -12 ఖాళీ ఉండగా, డిప్యూటీ సివిల్ సర్జన్-7 సివిల్ అసిస్టెంట్ సర్జన్-6 పోస్టులు ఖాళీ ఉన్నాయి. అంతేకాదు హెడ్ నర్స్-4, స్టాఫ్ నర్స్-27 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ముగ్గురు రెగ్యులర్ పిల్లల వైద్య నిపుణులు ఏరియా వైద్యశాలలో ఉండగా, వారిని వివిధ ప్రాంతాలకు బదిలీ చేయగా, వారి స్థానంలో ప్రత్యామ్నాయ భర్తీలను చేయకపోవడం గమనార్హం. ఇప్పటికైనా ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, ఏజెన్సీకి చెందిన ఎంపీలు ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు ఈ విషయమై వెంటనే స్పందించి చర్యలు చేపట్టాలని ఏజెన్సీ వాసులు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే వైద్యం అందక రోగుల ఇబ్బంది పడే పరిస్థితులు స్పష్టంగా ఉందని వాపోతున్నారు.

మద్దులపల్లిలో జేఎన్టీయూ భవనాల సర్వే

● కాంటూర్ సర్వే పూర్తి చేసిన అధికారులు



భూమిని సర్వే చేస్తున్న జేఎన్టీయూ అధికారులు

ఖమ్మం రూరల్, జూలై 21: మంత్రి పొంగులేటి చొరవతో పాలేరు నియోజకవర్గంలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణానికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఖమ్మం రూరల్ మండలం, మద్దులపల్లి రెవెన్యూ పరిధిలో కళాశాలకు కేటాయించిన 30 ఎకరాల్లో శాశ్వత భవనం నిర్మాణం ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. గత ప్రభుత్వం ఎన్నికలో భాగంగా జేఎన్టీయూ కళాశాల ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించినప్పటికీ, దాని నిర్మాణంపై శ్రద్ధ పెట్టలేదు. ప్రస్తుతం కళాశాలను అద్దె భవనంలోనే కొనసాగిస్తున్నారు. ఈనేపథ్యంలో పాలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే, రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని కళాశాలకు శాశ్వత భవనం ఉండేలా కృషి చేస్తున్నారు. తాజాగా రెండు రోజుల క్రితం జేఎన్టీయూ అధికారులు కాంటూర్ సర్వేను పూర్తి చేశారు. భవన నిర్మాణానికి కావల్సిన అన్ని ప్రణాళికలను రూపొందించారు. జేఎన్టీయూహెచ్ డైరెక్టర్లు, ప్రొఫెసర్లు డాక్టర్ వి.వెంకటేశ్వర రెడ్డి, డాక్టర్ బి.రవీంద్రరెడ్డి, డాక్టర్ డి.రమేష్, ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. త్వరలోనే శంకుస్థాపన చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

నేడు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మంత్రి పొంగులేటి పర్యటన

▸▸ పెదవాగు ప్రాజెక్టు పరిధిలో ముంపు గ్రామాల సందర్శన
▸▸ నేలకొండపల్లి మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కూసుమంచి/నేలకొండపల్లి, జూలై 21: రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10:30 గంటలకు అశ్వారావుపేట మండలంలోని పెదవాగు ప్రాజెక్టు పరిశీలించి, భారీ వర్షాల కారణంగా ప్రాజెక్టు పరిధిలో ముంపునకు గురైన పంటలను పరిశీలిస్తారు. అదేవిధంగా ముంపునకు గ్రామాలను సందర్శిస్తారు.

సాయంత్రం 4:00గంటలకు నేలకొండపల్లి మండల కేంద్రంలోని నూతన డ్రైనేజీ నిర్మాణ పనులకు బోదులబండ గ్రామం వద్ద రోడ్డు అభివృద్ధి పనులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రహరీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. మంత్రి కార్యక్రమాలకు కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జి దయాకర్‌రెడ్డి పార్టీ శ్రేణులను కోరారు.

ముహ్వాను సన్మానించిన ఎమ్మెల్యే జారే



మువ్వాకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే జారే

దమ్మపేట, జూలై 21: రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన మువ్వా విజయ్‌బాబును ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సత్కరించారు. తెలంగాణా రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం చైర్మన్‌గా మువ్వా విజయ్‌బాబు బాధ్యతలు చేపట్టారు. అట్టి కార్యక్రమంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పాల్గొని, మువ్వాకు శుభాకాంక్షలు తెలిపి, శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

పెద్దవాగు బాధితులకు బండి సంజయ్ ఫోన్

● బాధితుల యోగక్షేమాలు, వరద నష్టం, కారణాలపై ఆరా

కొత్తగూడెం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేట నియోజకవర్గంలోని పెద్దవాగు ప్రాజెక్టు కొట్టుకుపోవడంతో వరదలోచిక్కుకుపోయి ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది రాకతో సురక్షంగా బయటకు వచ్చిన నారాయణపురం గ్రామస్థులతో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఆదివారం ఢిల్లీ నుంచి ఫోన్ చేసి మాట్లాడారు. పెద్దవాగు ప్రాజెక్టు కొట్టుకుపోవడం వల్ల జరిగిన ప్రాణ, ఆస్తినష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ విషయంలో జిల్లా, రాష్ట్ర యంత్రాంగం పని చేసిందని, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ సీనియర్ నేత పొంగులేటి సుధాకర్ రెడ్డి ఈ విషయంలో చొరవ చూపారని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు రంగాకిరణ్ బాధితులతో బండి సంజయ్‌తో ఫోన్‌లో మాట్లాడించారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి గల్లంతు

● ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలతో గాలింపు ● పోట్లపల్లిలో ఘటన



నగేష్

పినపాక, జూలై 21: మండల పరిధిలోని పోట్లపల్లి గ్రామంలో ఆదివారం ఓ వ్యక్తి పోట్లపల్లి చెక్‌డ్యాం వద్ద చేపలు పట్టేందుకు వెళ్లి వాగులో గల్లంతయ్యాడు. పోట్లపల్లికి చెందిన బడే నాగరాజు, పాయం నగేష్‌లు ఆదివారం ఉదయం పోట్లపల్లి వాగు చెక్‌డ్యాం లోకి దిగి చేపలు పడుతుండగా, వరద ప్రవాహం ఒక్కసారిగా పెరగడంతో ఇద్దరు వాగులో కొట్టుపోయారు. కొంతదూరం వెళ్లిన తర్వాత నాగరాజు అతికష్టం మీద ఒడ్డుకు చేరుకున్నాడు. మరో వ్యక్తి నగేష్ మాత్రం గల్లంతయ్యాడు. ఏడూళ్లబయ్యారం ఎస్‌ఐ రాజ్‌కుమార్ పరిస్థితిని సమీక్షించారు. వెంటనే ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. చీకటి పడడంతో గాలింపు చర్యలను నిలిపివేశారు. భద్రాచలం ఆర్డీవో దామోదరరావు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. చెక్‌డ్యాం సమీపంలోకి ఎవరు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలిచ్చారు.

24న జాషువా వర్ధంతి సభ

ఖమ్మంసాంస్కృతికం, జూలై 21: జాషువా సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ఈనెల 24వ తేదీన సాయంత్రం 6 గంటలకు మహాకవి గుర్రం జాషువా వర్ధంతి సభను ఖమ్మం వీడీవోస్ కాలనీ లోని సర్వజ్ఞ స్కూల్ లో నిర్వహిస్తామని సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు మువ్వా శ్రీనివాసరావు, పగిడిపల్లి వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో పలువురు కవులు, సాహితీవేత్తలు పాల్గొని జాషువాను స్మరించుకుంటారని తెలిపారు. కవులు సాహిత్య అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఏపీ సీఎం చంద్రబాబుని కలిసిన నాయకులు



చంద్రబాబునాయుడుతో బూర్గంపాడు నాయకులు

బూర్గంపాడు, జూలై 21: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడిని ఆదివారం బూర్గంపాడు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే 2022 జూలైలో వచ్చిన గోదావరి వరదల సమయంలో బూర్గంపాడులో చోటుచేసుకున్న పడవ ప్రమాదంలో బూర్గంపాడుకు చెందిన వ్యక్తి మృతి చెందాడు. వరదల అనంతరం బూర్గంపాడు పర్యటనకు వచ్చిన చంద్రబాబునాయుడు పార్టీ తరఫున బాధిత కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సాయం అందజేస్తామని ప్రకటించారు. బాధిత కుటుంబానికి పరిహారాన్ని అందజేయాలని కోరగా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. సీఎంను కలిసిన వారిలో పినపాక నియోజకవర్గ టీడీపీ నాయకురాలు తాతా మాధవిలత, సంగు సుబ్బారెడ్డి ఉన్నారు.

కొణిజర్ల: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడిని కొణిజర్ల మండల టీడీపీ అధ్యక్షుడు తాతా సుధాకర్ మంగళగిరిలో ఆదివారం కలిశారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ గెలిచిన తర్వాత తొలిసారిగా చంద్రబాబును కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు.

విద్యార్థికి అస్వస్థత

ముదిగొండ, జూలై 21: ముదిగొండ మండలం గోకినపల్లి ఎస్సీ హాస్టల్‌లో ఉంటూ ప్రభుత్వ పాఠశాలలో ఐదోతరగతి చదువుతున్న బొడ్డు గౌతమ్ ఆదివారం అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన హాస్టల్ వార్డెన్ అన్వర్ గౌతమ్‌ను 108వాహనం ద్వారా ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతున్నాడు. ఆదివారం సాయంత్రం సమయంలో గౌతమ్‌కు జ్వరం రాగా టాబ్లెట్ ఇచ్చినట్లు వార్డెన్ తెలిపారు. ఆతర్వాత గౌతమ్‌కు ఫిట్స్‌లు రావడంతో ఆసుపత్రికి తరలించినట్లు వార్డెన్ తెలిపారు. ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గౌతమ్‌ను ఎస్సీ కార్పొరేషన్ డిప్యూటీ డైరెక్టర్ సత్యనారాయణ పరామర్శించారు. విద్యార్థి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని మెరుగైన వైద్యసేవలందించాలని వైద్యులను కోరారు.

ఆకట్టుకున్న ‘నిశ్శబ్దమా నీ ఖరీదెంత’ నాటిక

ఖమ్మంసాంస్కృతికం, జూలై 21: ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో నెలనెల వెన్నెల సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా ఆదివారం నిర్వహించిన ‘నిశ్శబ్దమా నీ ఖరీదెంత’.. నాటిక ప్రేక్షకులను ఆలోచింపచేసింది. చక్కని సామాజిక సందేశం ఇతివృత్తంగా కొనసాగిన నాటిక ఆద్యంతం అలరించింది. మనుషుల మధ్య సత్స సంబంధాలు, ఆప్యాయతా అనురాగాలు లోపిస్తే ఎదురయ్యే సమస్యలు దుష్పరిణామాల నేపథ్యంలో నాటిక ఆకట్టుకుంది. విశాఖ పట్టణం తెలుగు కళా సమితి కళాకారులు ప్రదర్శించిన ఈనాటికను పీ.టీ మాధవ్ రచించగా, చలసాని కృష్ణప్రసాద్ దర్శకత్వం వహించారు. కార్యక్రమంలో నెలనెల వెన్నెల నిర్వాహకులు ఎఎస్ కుమార్, మోటమర్రి జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు. నాటికకుముందు నిర్వహించిన సభలో ప్రముఖ న్యాయవాది జాబిశెట్టిపాపారావు, గార్లపాటి శ్రీహరి, అమరగాని వెంకటేశ్వరరావు గౌడ్, మోర్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



నాటికను ప్రదర్శిస్తున్న కళాకారులు

నగదు ఇవ్వాలని బెదిరింపులు

▸▸ ఐదుగురు విలేకరుల అరెస్ట్ ▸▸ రిమాండ్‌కు తరలింపు ▸▸ వివరాలు వెల్లడించిన కొత్తగూడెం వన్‌టౌన్ సీఐ కరుణాకర్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూలై21: మీ అమ్మ మృతి చెందడానికి కారణాలు మాకు తెలుసునని, ఆ వార్తను పేపర్‌లో రాయకుండా ఉండాలంటే మాకు నగదు ఇవ్వాలని ఓ వ్యక్తిని బెదిరించిన విలేకరులను పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం కొత్తగూడెం వన్‌టౌన్ సీఐ కరుణాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగూడెం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల ఓ మహిళను తన భర్త దాడి చేయడంతో మృతి చెందింది. ఈ సంఘటనపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా మృతిరాలి కుమారుడు దాసరి కార్తీక్‌కు నేను విలేకర్‌ను అంటూ ఫోన్‌లో శ్రీనివాస్ అనే పేరుతో ఓ వ్యక్తి పరిచయం చేసుకున్నాడు. మీ అమ్మ మృతి చెందడానికి గల కారణాలు మాకు తెలుసునని, వివాహేతర సంబంధాల కారణంగానే మీ నాన్న మీ అమ్మ అయిన దాసరి పూర్ణపై దాడి చేయడంతోనే మృతి చెందిందని తెలిపాడు. దీనికి సంబంధించిన విషయాలను పేపర్‌లో వార్త రూపంలో రాయకుండా ఉండాలంటే, తమకు కొంత నగదు ఇవ్వాలని ముగ్గురు వ్యక్తులను నీ వద్దకు పంపిస్తానని, ఫోన్‌లో మాట్లాడి పెట్టాశాడు. అనంతరం ఆ ముగ్గురు వ్యక్తులు మృతురాలి కుమారుడు ఇంటి వద్దకు వెళ్లి నగదు కావాలంటూ బెదిరింపులకు పాల్పడ్డారు. నేను నగదు ఇవ్వనని తేల్చి చెప్పడంతో, వారు వెనుతిరిగి వెళ్లిపోయారు. ఈ సంఘటనపై బాధితుడు, మృతురాలి కుమారుడు దాసరి కార్తీక్ కొత్తగూడెం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ దర్యాప్తులో నిందితులైన ఐదుగురు విలేకరులను గుర్తించారు. వారిని విచారించిన అనంతరం అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. అరెస్ట్ అయిన విలేకర్లలో లక్ష్మీదేవిపల్లి మండలానికి చెందిన రాజేష్‌కుమార్, కొత్తగూడెం పట్టణంలోని బర్లిఫీట్ ప్రాంతానికి చెందిన దాసరి సాంబశివరావు, చుంచుపల్లి మండలంలోని హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన గుంటూరు శ్రీనివాసరావు, చుంచుపల్లి మండలం రుద్రంపూర్ ప్రాంతానికి చెందిన మేకల రమేష్, కొత్తగూడెం పట్టణంలోని మేదరబస్తీకి చెందిన బాదావత్ గణేష్‌లు ఉన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం వన్‌టౌన్ ఎస్‌ఐ విజయకుమారి, సిబ్బంది రాందాస్ తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ కరుణాకర్

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

ముదిగొండ, జూలై 21: ద్విచక్రవాహనాన్ని డోజర్ ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన ముదిగొండ మండలం చిరుమర్రి గ్రామం వద్ద ఆదివారం చోటుచేసుకుంది. ముత్తారం గ్రామానికి చెందిన నారపొంగు సింహాద్రి(22) తన ద్విచక్ర వాహనంపై ముదిగొండ నుంచి ముత్తారం వైపు వెళ్తుండగా, ఎదురుగా వచ్చిన డోజర్ ఢీకొనడంతో కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు ముదిగొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అన్నం ఫౌండేషన్‌కు గుర్తు తెలియని మహిళ అప్పగింత



మహిళను అన్నం ఫౌండేషన్‌కు తరలిస్తున్న సభ్యులు

కొణిజర్ల, జూలై21: మండలంలోని తనికెళ్ల సమీపంలో మతిస్థిమితం లేని మహిళ జోరువానలో తడుచుకుంటూ రోడ్డు పక్కన నడుచుకుంటూ ఎటువెళ్లాలో తెలియక నిస్సాహయస్థితిలో ఉండగా, స్థానికులు అన్నం ఫౌండేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఆదివారం అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు, సభ్యులు ఆ మహిళను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి ఆ మహిళ గురించి పోలీసులకు వివరించారు. అక్కడ నుంచి అన్నం ఫౌండేషన్‌కు తరలించారు.

గూడ్స్‌రైలు ఢీకొని 20గొర్రెల మృత్యువాత



మృత్యువాతపడిన గొర్రెలు

పెనుబల్లి, జూలై 21: మేతకు వెళ్లిన గొర్రెల మందను గూడ్స్‌రైలు ఢీకొనడంతో 20గొర్రెలు మృతి చెందిన సంఘటన పెనుబల్లి మండలం పార్థసారథిపురం గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జోగు నాగేశ్వరరావుకు చెందిన గొర్రెల మందను రోజు మాదిరిగా మేతకు తోలుకొని వెళ్లగా, సత్తుపల్లి సింగరేణి గని నుంచి కొత్తగూడేనికి బొగ్గు తీసుకువెళ్తున్న గూడ్స్ రైలు పార్థసారథిపురం అండర్‌పాస్ సమీపంలో గొర్రెల మందను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 20గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. మృతి చెందిన గొర్రెల విలువ సుమారు రూ.3లక్షలు ఉంటుందని బాధితుడు తెలిపాడు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

● వైద్యుల నిర్లక్ష్యంతో మృతి చెందాడని బంధువుల ఆరోపణ

ఖమ్మంకలెక్టరేట్, జూలై 21: వైద్యుల నిర్లక్ష్యంతోనే వ్యక్తి మృతి చెందాడని ఆరోపిస్తూ మృతుడి బంధువులు ఓ ఆస్పత్రి ఎదుట ఆందోళన నిర్వహించిన సంఘటన ఖమ్మం నగరంలో ఆదివారం జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కామేపల్లి మండలం బర్లగూడేనికి చెందిన బానోత్ శంకర్ నాయక్(40)కు జ్వరం రావడంతో కుటుంబ సభ్యులు శనివారం ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం చెందాడు. వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతి చెందాడని మృతుడి బంధువులు ఆస్పత్రి వద్ద ఆందోళన చేపట్టారు. వైద్యం అందిస్తున్నామని చెప్పి లోనికి వెళ్లనివ్వకుండా అడ్డుకున్నారని వాపోయారు. కనీసం మృతదేహాన్ని చూసేందుకు కూడా అనుమతి ఇవ్వలేదని పేర్కొన్నారు. తమకు న్యాయం చేయాలని ఆందోళనకు దిగారు. ఆసుపత్రి యాజమాన్యాన్ని ప్రశ్నించినందుకు తమపై గూండాలతో బయటకు నెట్టివేశారని ఆరోపించారు. మృతికి కారణమైన ఆసుపత్రి యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. బంధువుల ఆందోళనతో ఉద్రిక్తంగా మారడంతో వన్‌టౌన్ పోలీసులు అక్కడకు చేరుకొని, పరిస్థితిని చక్కదిద్దారు. చివరికి ఆసుపత్రి యాజమాన్యంతో మృతుడి బంధువులు చర్చలు జరిపారు.

ముగిసిన సింగరేణి ఉద్యోగ నియామక పరీక్షలు

● త్వరలోనే కీ విడుదల చేస్తాం● సీఎండి ఎన్. బలరాం

కొత్తగూడెం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థలో రెండు రోజుల పాటు నిర్వహించిన కంప్యూటర్ ఆధారిత పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని, త్వరలోనే కీ విడుదల చేస్తామని సింగరేణి సంస్థ చైర్మన్, మేనేజింగ్ అండ్ డైరెక్టర్ ఎన్. బలరాం నాయక్ తెలిపారు. ఆదివారం పరీక్ష కేంద్రాలను సీఎండి, డైరెక్టర్ (పర్సనల్, ఆపరేషన్స్) ఎన్ఈకే. శ్రీనివాసులుతో కలిసి పరీక్ష కేంద్రాలను పరిశీలించి మాట్లాడారు. సింగరేణి సంస్థలో ఖాళీగా ఉన్న 272 పోస్టుల భర్తీకి గాను, ఈ నెల 21, 21 తేదీల్లో తొలిసారిగా హైదరాబాద్‌లోని 12 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. పరీక్షలను పూర్తిగా పాదర్శకంగా నిర్వహించామన్నారు. సింగరేణిలో ఉద్యోగాలు ఇప్పిస్తామని ఎవరైనా ప్రలోభ పెడితే వారి మాటలను నమ్మి మోసపోవద్దని సూచించారు. అలాంటి వారి సమాచారాన్ని సింగరేణి విజిలెన్స్ విభాగానికి, పోలీస్‌శాఖ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. 20వ తేదీన నిరహించిన (జూనియర్ ఎస్టేట్స్ ఆఫీసర్, మేనేజ్‌మెంట్ ట్రైనీ ఎఫ్అండ్ఏ), జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్, మేనేజ్‌మెంట్ ట్రైనీ హైడ్రోజిలాయాలజిస్టు, మేనేజ్‌మెంట్ ట్రైనీ, సివిల్ జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్, మేనేజ్‌మెంట్ ట్రైనీ (ఐటీ), సబ్ ఓవర్ సిర్ ట్రైనీ సివిల్ పోస్టులకు పరీక్షలు నిర్వహించామన్నారు. మొత్తం 11,724 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా, 7,070 మంది పరీక్షలు రాసినట్లు తెలిపారు. 21వ తేదీన నిర్వహించిన మేనేజ్‌మెంట్ ట్రైనీ (మైనింగ్, మేనేజ్‌మెంట్ ట్రైనీ (పర్సనల్) పోస్టుల పరీక్షలకు 6,931మందికి గాను 4,072మంది పరీక్ష రాసినట్లు తెలిపారు. మొత్తం మీద 18,665 మందికి హాలు టిక్కెట్లు జారీ చేయగా 12045 మంది పరీక్షలకు హాజరైనట్లు తెలిపారు. పరీక్షలను అత్యంత పారదర్శకంగా నిర్వహించడం పట్ల ఆయన సంతృప్తిని వ్యక్తం చేశారు.

పేకాట స్థావరాలపై దాడి: పలువురి అరెస్టు

నేలకొండపల్లి, జూలై21: మండల పరిధిలోని మంగాపురంతండాలో పేకాట స్థావరంపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి రూ.8,100లు స్వాధీనం చేసుకున్నట్లు నేలకొండపల్లి ఎస్‌ఐ తోట నాగరాజు తెలిపారు.

దుమ్ముగూడెం, జూలై 21: మండల పరిధిలోని పర్ణశాలలో పేకాట స్థావరంపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో తొమ్మిది మంది జూదరులు పట్టుబడగా, వారి నుంచి రూ49,920ల నగదును స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో సీఐ బొడ్డు అశోక్, ఎస్‌ఐ గణేష్, సిబ్బంది పాల్గొన్నారు. సంఘటనపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోను ఢీకొట్టిన కారు

▸▸ ఇద్దరు మృతి.. నలుగురికి తీవ్రగాయాలు
▸▸ వైద్యం కోసం వచ్చి వెళ్తుండగా ప్రమాదం
▸▸ జగన్నాథపురం వద్ద ఘటన
▸▸ మృతులు ఏపీలోని ఎన్‌టీఆర్ జిల్లా వాసులు

చింతకాని, జూలై 21: వైద్యం కోసం ఖమ్మం వచ్చి.. చికిత్స అనంతరం ఇంటికి తిరిగి వెళ్తుండగా అనూహ్యంగా దూసుకొచ్చిన కారు వారిపాలిట మృత్యుశకటమైంది. ఖమ్మం జిల్లా చింతకాని మండలంలో జగన్నాథపురం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, నలుగురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని ఎన్‌టీఆర్ జిల్లా వత్సవాయి మండలం కన్నెవీడు గ్రామానికి చెందిన కరిసే సుజాత అనారోగ్యంతో బాధపడుతుండడంతో చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు రెండు రోజుల క్రితం ఆమెను ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకొచ్చారు. చికిత్స అనంతరం ఆదివారం కుటుంబ సభ్యులంతా ఆటోలో స్వగ్రామానికి బయలుదేరారు. ఈ క్రమంలో చింతకాని మండలం జగన్నాథపురం దాటిన తరువారం వారు ప్రయాణిస్తున్న ఆటోను ఎదురుగా అతివేగంతో వచ్చిన కారు బలంగా ఢీకొనడంతో ఆటో రోడ్డు పక్కకు ఎగిరి పడి ధ్వంసమైంది. ప్రమాద దాటికి ఆటోలో ప్రయాణిస్తున్న ఆరుగురు చెల్లా చెదురుగా పడిపోయారు. స్థానికులు ఈ ప్రమాదంపై పోలీసులకు సమాచారం ఇవ్వడంతో, ఎస్‌ఐ నాగుల్‌మీరా ఘటన ప్రాంతానికి చేరుకుని సిబ్బంది, స్థానికుల సహాయంతో క్షతగాత్రులను 108వాహనంలో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న కరిసే వెంకటరత్నం (50) ఘటనా స్థలంలోనే మృతిచెందగా, తీవ్రంగా గాయపడ్డ చెరుకుపల్లి హైమావతి (45) ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందింది. ఆటో డ్రైవర్‌తో పాటు మరో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. మృతి చెందిన వెంకటరత్నం, హైమావతి వరుసకు అన్నాచెల్లెలు. వెంకటరత్నం కన్నెవీడు సొసైటీలో గుమస్తాగా పనిచేస్తున్నాడు. ప్రమాద స్థలాన్ని వైరా సీఐ సాగర్ సందర్శించారు.



వెంకటరత్నం(ఫైల్)



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ సాగర్

బీటీ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి

● కాంగ్రెస్ నాయకుల డిమాండ్

కల్లూరు, జూలై 21 మండలంలోని ఎర్రబోయనపల్లి గామంలో ఊరచెరువు కట్టపై నిర్మించిన బీటీ రహదారి నాసిరకం నిర్మాణం పనులతో కుంగిందని మండల కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ఆదివారం సదరు బీటీ రహదారి కుంగిన ప్రదేశాన్ని మండల కాంగ్రెస్ నాయకులు ఏనుగు సత్యంబాబు, మద్దినేని శ్రీనువాసరావు, ముకర విజయరావు, నలజాల మంగపతిరావులు సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ ఎర్రబోయనపల్లి నుంచి పాత ఎర్రబోయినపల్లి వరకు గత ఏడాది క్రితం నిర్మించిన రహదారి గుత్తేదారు నాసిరకంగా నిర్మించారని ఆరోపించారు. ఏడాది గడవక ముందే వర్షాలతో ఈ రహదారి కుంగి పోయిందన్నారు. మండలంలోని కొత్త, పాత ఎర్రబోయనపల్లి గ్రామాలకు ఈ రహదారి అనుసధానంగా మారిందని వారు తెలిపారు. ఈ రహదారిపై ప్రయాణించడానికి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రజాధనం దుర్వినియోగం కాకుండా అధికారులు దృష్టి సారించి కుంగిన రహదారి ప్రదేశానికి మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తాళ్ల వెంకటేశ్వరరావు, సాంబ తదితరులు పాల్గొన్నారు.



కుంగిన రహదారిని పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

విద్యుదాఘాతంతో మేకలు మృతి

దమ్మపేట, జూలై 21: విద్యుదాఘాతంతో మేకలు మృతి చెందిన ఘటన నాగుపల్లిలో గ్రామంలో ఆదివారం జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం..

నాగుపల్లి గ్రామానికి చెందిన రాంబాబు రోజు మాదిరిగా మేకలు తోలుకొని సమీప పొలాల వద్దకు వెళ్లాడు. కాగా ఓ పామాయిల్ తోటలో కిందపడి ఉన్న విద్యుత్ తీగలకు తగిలి ఐదు మేకలు అక్కడికక్కడే మృతి చెందాయి. మృతి చెందిన మేకల విలువ రూ.లక్ష పైగా ఉంటాయని బాధితుడు తెలిపాడు.

తండ్రికి తలకొరివి పెట్టిన తనయ

బూర్గంపాడు, జూలై 21: తండ్రికి కుమార్తె తలకొరివి పెట్టిన ఘటన ఆదివారం సారపాకలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం..బూర్గంపాడు మండల పరిధిలోని సారపాక పంచాయతీలో గల సుందరయ్యనగర్‌కు చెందిన గారె సమ్మయ్య(60) సారపాకలోని ఓ కంపెనీలో సెక్యూరిటీగా విధులు నిర్వర్తించేవాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. కాగా మృతుడికి కుమారులు లేకపోవడంతో కుమార్తె తండ్రికి తలకొరివి పెట్టింది.

అవసరమైతే తప్ప బయటకు రావొద్దు: ఎస్పీ

కొత్తగూడెం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భారీ వర్షాల కారణంగా వాగులు, వంకలు, నదుల వద్ద ప్రవాహం అధికంగా ఉందని, ప్రజలు అవసరమైతే తప్ప బయటకు రావద్దని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. జలాశయాలు, చెరువులు, వాగుల వద్దకు సెల్ఫీలు దిగడానికి, చేపలు పట్టడానికి ఎవరు వెళ్ల కూడదని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. వరద నీటితో ప్రమాదకరంగా మారిన రోడ్లను దాటడానికి ప్రయత్నించి ప్రమాదాల బారిన పడవద్దని సూచించారు. సరదాల కోసం పిల్లలు, యువకులు ఫొటోల కోసం, ఈతలు కొట్టడానికి వెళ్లకుండ తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. విపత్కరసమయాల్లో 100కు ఫోన్ చేసి తక్షణమే పోలీసుల వారి సహాయం పొందాలని తెలిపారు. ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా భద్రాచలం వద్ద గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తుందని లోతుట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలీసు వారు చేపట్టే చర్యలకు జిల్లా ప్రజలందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఎడతెరిపి లేని వాన

మణుగూరులో కూలిన రేకుల ఇల్లు.. తప్పిన ప్రాణ నష్టం

జిల్లాలో పలు ప్రాంతాలకు నిలిచిన రాకపోకలు

సింగభూపాలెం చెరువుకు భారీగా వరద నీరు

మణుగూరుటౌన్/మణుగూరు, జూలై 21: మణుగూరుతోపాటు సబ్ డివిజన్‌లో వారం రోజులుగా కురుస్తోన్న వర్షాలతో జనజీవనం స్తంభించిపోతోంది. శనివారం రాత్రి చిరు జల్లులతో ప్రారంభమైన వర్షం కొద్ది సమయంలో ఉగ్రరూపం దాల్చి ఆదివారం ఉదయం సాయంత్రం వరకు భారీగా కురిసింది. దీంతో ఏరియాలో కాలువలు, వాగులు పొంగిపొర్లగా.. చెరువులు జళకలను సంతరించుకున్నాయి. మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని విఠల్‌రావునగర్ ప్రాంతంలో కొద్దిరోజులుగా కురుస్తోన్న వర్షాలకు నానిపోయి ఉన్న గోగుల జయలక్ష్మీ రేకుల ఇల్లు ఇంట్లో మనుషులుండగానే కూలిపోయింది. దీంతో స్థానికులు వెంటనే అప్రమత్తమై రేకులను పగులగొట్టి విద్యుత్ సరఫరాను నిలిపివేసారు. ఇంట్లో ఉన్న మనుషులను సురక్షితంగా బయటకు తీయడంతో ప్రాణపాయం తప్పింది. పీవీ కాలనీకి వెళ్లేమార్గంలో ఓ వృక్షం వర్షం కారణంగా రోడ్డుపై పడిపోగా.. వెంటనే సంబంధిత అధికారులు, పోలీసులు దానిని తొలగించి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు వహించారు. రామానుజవరం సమీపంలో సింగరేణి నిర్వాసితులకోసం ఏర్పాటు చేసిన కొత్తమల్లే పల్లి గ్రామానికి వరదల కారణంగా రాకపోకలు నిలిచిపోయాయి. రామానుజవరం నుంచి పగిడేరు వెళ్లే రహదారిపై వరద నీరు భారీగా చేరుడంతో కొత్తపల్లే నిర్వాసిత గ్రామంతోపాటు పగిడేరు పంచాయతీ పరిధిలోని పలుగ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. భారీ వర్షాల కారణంగా గంట గంటకు గోదావరి నదీ ప్రవాహం పెరుగుతుండడంతో మణుగూరు తహసీల్దార్ రాఘవరెడ్డి ఆదివారం నదీ పరివాహక ప్రాంతాలను సందర్శించారు. గోదావరి నది ఉధృతిని పరిశీలించారు. నదీ పరివాహక గ్రామ ప్రజలు నదివైపు వెళ్లవద్దని సూచించారు.

సింగభూపాలెం చెరువుకు భారీగా వరద నీరు

సుజాతనగర్: సుజాతనగర్ మండలంలోని సింగభూపాలెం చెరువుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఆదివారం ఉదయానికి చెరువులో నీటి మట్టం 10 అడుగులకు చేరుకుంది. గత నాలుగు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు సింగభూపాలెం చెరువు వరద నీటితో జలకళను సంతరించుకుంది. చెరువు అలుగు కుడికాలువ వద్ద 18 అడుగులు కాగా ఆదివారం ఉదయం 10 అడుగులు, ఎడమ కాలువ వద్ద 22 అడుగులకు అలుగు కాగా 13.5 అడుగుల నీటి మట్టానికి వరద నీరు చేరుకుంది. ఇంకా రెండు రోజులపాటు విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలుపుతుండటంతో త్వరలోనే అలుగు పోసే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. ఈ సందర్భంగా ఇరిగేషన్ ఏఈ కార్తీక్‌ను ఫోన్లో పలకరించగా కరకట్ట పటిష్టంగా ఉందని, కరకట్ట పనులు పూర్తయి రెండు సీజన్‌లు గడిచాయని, మెయిన్ తూము వద్ద ఎవరూ సెల్ఫీలకు వెళ్లి ప్రమాదానికి గురికాకుండా అడ్డుగా బారికేడ్లను ఏర్పాటు చేశామని, ముందస్తు చర్యల్లో భాగంగా ఇసుక బస్తాలను నింపి ఉంచామని, కరకట్ట మీదకు ఎలాంటి వాహనాలకు అనుమతి లేదని త్వరలోనే కరకట్ట ప్రారంభంలోనే బారికేడ్లు ఏర్పాటు చేయనున్నామని తెలిపారు.

పునరావాస ఏర్పాట్లను పరిశీలించిన ఆర్డీవో

దుమ్ముగూడెం: మంగువాయిబాడవ గిరిజన బాలికల ఆశ్రమపాఠశాలలో వరద బాధితులకు పునరావాస ఏర్పాట్లను ఆర్డీవో దామోదరావు ఆదివారం పరిశీలించారు. నిర్వాసితులకు అవసరమైన గదులు, తాగునీరు, వంటశాల, వంటవాళ్ల లభ్యత తదితర అంశాలను సమీక్షించారు. వరద పెరిగిన పక్షంలో సున్నంబట్టి, ఎం.కాశీనగరం గ్రామాల వారిని మంగువాయిబాడవ ఆశ్రమ పాఠశాలకు తరలించాలని ఆదేశించారు. తహసీల్దార్ చంద్రశేఖర్, ఆర్ఐలు ఆదినారాయణ, లక్ష్మయ్య, హెచ్ఎం వీరాకుమారి ఉన్నారు.

పంటపొలాలు నీటముంపు

పాల్వంచ రూరల్: మండలంలోని కిన్నెరసాని, మొర్రేడు పరివాహక ప్రాంతాల్లో పంటపొలాలు నీటముంపునకు గురయ్యాయి. నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండ వర్షాలు కురవడంతో కిన్నెరసాని జలాశయం గేట్లు ఎత్తడంతో నీరు దిగువకు చేస్తున్నారు. దీంతో రాజాపురం, యానంబైలు, పాండురంగాపురం, సోములగూడెం, నాగారం గ్రామాల్లోని పంట పొలాలు నీట మునిగాయి. అదేవిధంగా మొర్రేడు ప్రవాహం వల్ల సంగం, దంతెలబోర తదితర గ్రామాల్లో పంటచేల్లో నీరు నిలిచింది. ఎక్కువగా పత్తిచేలో నీటి ముంపుకు గురై వరద బారినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

పొంగి పొర్లిన వాగులు, ఒర్రెలు

కరకగూడెం: మండల వ్యాప్తంగా మూడు రోజుల పాటు కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షానికి మండలంలోని వాగులు, ఒర్రెలు పొంగి పొర్లుతున్నాయి. ఎడతెరిపి లేకుండా ఆదివారం కురుస్తున్న వర్షానికి, ఈదురు గాలులకు మండలంలోని రైతులు, ప్రజలు ఇంటి నుంచి కాలు బయట పెట్టాలంటే భయాందోళన చెందల్సి వచ్చింది. మండల వ్యాప్తంగా కురుస్తున్న వర్షానికి గుట్టలు, పులుసుబొంత, వట్టివాగు, అడవుల నుంచి వచ్చిన వరదతో మండలంలోని పెద్దవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. మండలంలోని రాళ్ళవాగు, బూడిదవాగులో వర్షపునీరు పొంగిపొర్లుతున్నాయి. మండలంలోని కొత్తగూడెం పంచాయితీ కొత్తగూడెం కొమరంవారిగుంపు మధ్యలోని మురికి ఒర్రె పొంగి పొర్లుతుండటంతో రెండు గ్రామాలకు రాక పోకలు నిలిచాయి. దాంతో అధికారులు అప్రమత్తం అయ్యారు. రెండు గ్రామాల ప్రజలు రాక పోకలు చేయకుండా చర్యలు చేపట్టారు. మండలంలోని పలు చెరువులు నిండి మత్తడి పోస్తున్నాయి.



సుజాతనగర్ సింగభూపాలెం చెరువు



కరకగూడెం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న పెద్దవాగు

జోరుగా ప్రవహిస్తున్న వాగులు

ఆళ్లపల్లి: ఆళ్లపల్లి మండల వ్యాప్తంగా ఐదవరోజు ఆదివారం కూడా అదే జోరువాన కురిసింది. రెండు రోజులగా ఓ మోస్తారుగా ప్రవహించిన వాగులు, ఆదివారం ఉధృతంగా ప్రవహించాయి. మండలంలోని పలు చెరువులు అలుగులు పోసుకున్నాయి. ప్రవహిస్తున్న వాగుల వద్ద గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని టేకులపల్లి సీఐ సురేష్ సూచించారు. నిత్యావసర సరుకుల కోసం వాగు అవతల ఉన్న గ్రామస్తులు వాగు దాటాల్సిన పరిస్థితులు వచ్చాయి. మర్కోడు రేగడి చేరువు అలుగు పోయడంతో గతేడాదిలా ఏ రాత్రి అలుగు వరద ముంచుతుందోనని చూట్టుపక్కల వారు ఆందోళన చెందుతున్నారు. రెవెన్యూ, మండల పరిషత్, పోలీస్ అధికారులు మాత్రం రేగడి చెరువు అలుగు ప్రవాహ ప్రమాదంపై నాలుగేళ్లుగా నోరు మెదపకపోవం గమనార్హం. కాగా ఆ నీరు ప్రవహిస్తున్న బ్రిడ్జీ కూడా కూలేందుకు సిద్దంగా ఉంది. అధికారులు తక్షణం చర్యలు తీసుకోకపోతే భారీ ప్రమాదం ఉంది. అత్యవసరం అయితే తప్ప ప్రజలెవరూ ఇళ్ల నుంచి బయటకు రావద్దని అధికారులు సూచిస్తున్నారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

పొంగిన వాగులు, వంకలు

అశ్వాపురం: ఎడతెరిపి లేని వర్షం కారణంగా మండలంలో ఆదివారం పలు వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. గొందిగూడెం-అశ్వాపురం గ్రామాల మధ్య ఇసుక వాగు, తుమ్మలచెరువు-వెంకటాపురం గ్రామాల మధ్య లోతు వాగులు పొంగి ప్రవహించటంతో ఆయా గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. జనజీవనం స్తంభించింది.

స్తంభించిన రాకపోకలు

గుండాల: గుండాల మండలంలో ఎడతెగని వర్షం కురుస్తోంది. గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో వాగులు వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. ముసురు వీడేలా కనిపించడంలేదు. ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షానికి జనజీవనం స్తంభించింది. కిన్నెరసాని, మల్లన్నవాగు, ఏడుమేలికల వాగు, తొట్టివాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో దొంగతోగు, సజ్జలబోడు, నాగారం, కొడవటంచ, మల్లెలగుంపు, మంటంలంక, దామరతోగు దొరగుంపు గ్రామాలకు రాకపోకలు స్తంభించి పోయాయి. కిన్నెరసాని ఉధృతంగా ప్రవహిస్తుండటంతో కొడవటంచ వద్ద వంతెన నీటిలో మునిగి పోయింది. చెరువులు, కుంటల్లోకి భారీగా నీరు వచ్చిచేరి మెత్తడి దూకుతున్నాయి. కాగా ఉప్పొంగుతున్న వాగులను దాటడం రైతులకు తప్పని సరిగా మారిందని రైతులు వాపోతున్నారు వాగుకు మరో పక్కన ఉన్న పంట చేలు, పశువుల మందల కోసం వాగులు దాటాల్సి వస్తుందని పేర్కొంటున్నారు. హై లెవల్ వంతెనలు మంజూరు చేయాలని ఎన్ని సార్లు విన్నవించుకున్నా స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా మరో రెండు నుంచి మూడురోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులను దాటకుండా ప్రజలకు హెచ్చరిక జారీ చేశారు.



కిన్నెరసాని పరిధిలో నీట మునిగిన పత్తి చేను



అలుగుపోస్తున్న మర్కోడు రేగడి చెరువు



ఉధృతంగా ప్రవహిస్తున్న అశ్వాపురం లోతువాగు



పొంగి పొర్లుతున్న కోడిపుంజుల వాగు

మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించాలి

పాల్వంచ టౌన్, జూలై 21: పాల్వంచ మున్సిపాలిటికి తక్షణం ఎన్నికలు నిర్వహించాలని యువతరం రాష్ట్ర అధ్యక్షుడు పోట్రు ప్రవీణ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించి విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్, సీపీఐ ఇచ్చిన హామీని నిలపెట్టుకోవాలని కోరారు. కొత్తగూడెం కార్పోరేషన్ ఏర్పాటు చేస్తామన్న దానికి తమ మద్దతు ఉంటుందని, పాల్వంచ మున్సిపాలిటిని కొత్తగూడెంలో విలీనం చేసే చర్యను తమ పార్టీ వ్యతిరేకిస్తుందని తెలిపారు.

'ఫ్రంట్‌లైన్ కార్మికులు అప్రమత్తంగా ఉండాలి'

చుంచుపల్లి, జూలై 21: వరదల పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని ఫ్రంట్‌లైన్ కార్మికులు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో భాస్కర్‌నాయక్ సూచించారు. ఆదివారం తన కార్యాలయంలో జూమ్ సమావేశాన్ని జిల్లా వైద్య ఆరోగ్య అధికార సిబ్బందితో మాట్లాడారు. తక్కువ నీటి మట్టం ఉన్న ప్రాంతాలలో ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు. ఇంటింటికీ సర్వే నిర్వహించి అనారోగ్యం బారిన పడిన వారి నివేదికను సిద్ధం చేసి వైద్య సేవలను అందించాలన్నారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తిన జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని, వర్షాలకు, వరదలకు భయాందోళన చెందకుండా బాధితులకు భరోసా కల్పించాలన్నారు.

మునిసిపాలిటీలో అభివృద్ధి కనబడుట లేదా?

కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మీ

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూలై 21: కొత్తగూడెం మున్సిపాలిటీలో గడిచిన నాలుగున్నర సంవత్సరాల కాలంలో సుమారు రూ.214 కోట్లతో ప్రజా మౌలిక వసతులు దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి చేశామని, ప్రస్తుతం అది కనబడుట లేదా అని కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మీ ప్రశ్నించారు. ఆదివారం కొత్తగూడెం మునిసిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. మున్సిపాలిటీ పరిధిలోని 36 వార్డులలో స్వచ్ఛమైన వాహనాలు, ట్రాక్టర్లు, జేసీబీలు, డ్రైన్ క్లీనింగ్ మిషన్ జేసీబీలు తదితర శానిటేషన్ వాహనాలతో స్వచ్ఛ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతున్నామని గుర్తు చేశారు. రూ.124 కోట్లతో మంచి నీటి సమస్య పరిష్కారానికి పనులకు శ్రీకారం చుట్టామని, రూ.400 కోట్ల నిధులతో బైపాస్ రోడ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రజా క్షేత్రంలో గెలవాలని ఉంటే పోరాడాలే తప్ప ప్రజా ప్రతినిధులను విమర్శిస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. ఈ సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ దామోదర్, కౌన్సిలర్‌లు కంచర్ల జమలయ్య, భూక్యా శ్రీనివాస్, వేణుగోపాల్, వై.శ్రీనివాస్‌రెడ్డి, ధర్మరాజు, అనిల్, చారి, విజయలక్ష్మీ పాల్గొన్నారు.

పొంగుతున్న వాగులను దాటొద్దు: ఎస్ఐ

కరకగూడెం, జూలై 21: మండల వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు పొంగి పొర్లుతున్న వాగులను, ఒర్రెలను ప్రజలు దాటే సాహసం చేయవద్దని కరకగూడెం ఎస్ఐ రాజేందర్ కోరారు. ఎడతెరిపి లేని వర్షంతో కుర్నవల్లి వద్ద బూడిదవాగు, కొత్తగూడెం కొమరంవారిగుంపు మధ్య పొంగిపొర్లుతున్న మురికి ఒర్రె, పెద్దవాగులలో ప్రవహిస్తున్న వరదను ఎస్ఐ రాజేందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అత్యవసర పరిస్థితుల్లో తప్ప ప్రజలు ఇంటి నుంచి బయటకు రావద్దన్నారు. వాగులు, ఒర్రెలు పొంగి పొర్లుతున్నాయని ప్రజలు వాగులు దాటే ప్రయత్నం చేయవద్దని కోరారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

అథ్లెట్లు రాష్ట్ర స్థాయి పతకాలు సాధించాలి

దమ్మపేట, జూలై 21: దమ్మపేటలోని తెలంగాణా గిరిజన రెసిడెన్షియల్ కాలేజి ఆవరణలో ఆదివారం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా అథ్లెటిక్స్ ఎంపికలు జరిగాయి. పోటీలను కళాశాల ప్రిన్సిపాల్ జానూ నాయక్ జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జోరున వర్షం పడుతున్న కూడా జిల్లా నలుమూలలు నుంచి క్రీడాకారులు రావటం అభినందనీయమన్నారు. రానున్న రాష్ట్ర, జాతీయ పోటీల్లో పతకాలు గెలుపొందాలని సూచించారు. భద్రాద్రి జిల్లా పేరును జాతీయస్థాయిలో నిలపాలని కోరారు. జిల్లా నలుమూలల నుంచి 80 మంది పాల్గొన్నారని, ఇందులో ప్రతిభ చూపిన 20మందిని ఎంపిక చేశామని తెలిపారు.



పరుగు పందెంలో పాల్గొన్న క్రీడాకారులు

భాషను పరిరక్షించుకోవాలి:పీవో

భద్రాచలం, జూలై 21: భద్రాచలం ఏజెన్సీలోని ఆదివాసీ సమాజం సంస్కృతి సంప్రదాయాలతో పాటు భాషను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతో ఉందని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. భద్రాచలంలోని గిరిజన భవన్‌లో ఆదివారం విశ్వకోయ భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిధిగా హాజరైన పీవో మాట్లాడుతూ సమాజంలో అందరిలా ముందుకు సాగాలంటే భాషపై పట్టు ప్రతి ఒక్కరికి ఎంతో అవసరం అన్నారు బాల్యం నుంచి ప్రాథమిక విద్య వరకు ఇంట్లోని కుటుంబ సభ్యులు తమ పిల్లలకు విధిగా భాషను నేర్పాలని, సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకునేందుకు వాటి ప్రాధాన్యతను వారికి వివరించాలన్నారు. ఐటీడీఏ పీవోగా కోయభాష అభివద్ధికి తనవంతు సహకారం అందిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డీడీ మణెమ్మ, ఏపీవో జనరల్ డేవిడ్‌రాజు, పీఎంఆర్సీ ఏటీవో తెల్లం రమణయ్య, మ్యూజియం నిర్వాహకులు కొండ్రు వీరస్వామి, ఆదివాసీ గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వీసాల కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో రాహుల్

శాకాంబరిగా అమ్మవారు

మణుగూరుటౌన్, జూలై 21: గురపౌర్ణమి, వాసమహర్షి జన్మదినాన్ని పురస్కరించుకుని అశోక్‌నగర్‌లోని సాయిబాబా, భవానిశంకర ఆలయం, గుట్టమల్లారంలోని వేదగాయత్రిదేవి, రామానుజవరంలోని సంతాన వేణుగోపాలస్వామి ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ భవాని శంకర ఆలయంలోని అమ్మవారిని ప్రత్యేకంగా కూరగాయలతో అలంకరించి పూజలు నిర్వహించారు. ఈ శాకంబరీ దేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ నిర్వాహకులు మల్లిఖార్జున్‌రావు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

నీటిపారుదల రంగం పురోగతి

చంద్రుగొండ, జులై 21: రాష్ట్ర నీటి పారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నియమితులైన మువ్వా విజయబాబు సహకారంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నీటి పారుదల రంగం మరింత పురోగతి సాధిస్తుందని మండల కాంగ్రెస్ నాయకులు తెలిపారు. విజయబాబు ఆదివారం హైరాబాద్‌లో చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆ పార్టీ సీనియర్ నాయకులు ఉప్పతల ఏడుకొండలు, సారేపల్లి శేఖర్ ఆధ్వర్యంలో కార్యకర్తలు చంద్రుగొండ పార్టీ కార్యాలయంలో కేక్‌కట్ చేసి, మిఠాయిలు పంచారు. అనంతరం ఇరువురు నాయకులు మాట్లాడుతూ ఇప్పటికే మంత్రులు తుమ్మల నాగేశ్వరావు, భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లాలో నీటి పారుదలకు ప్రత్యేక దృష్టిసారించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకలు బడుగు కృష్ణవేణి, ఇస్లావత్ రుక్మిణి, మనోహర్, కడియాల పుల్లయ్య, బుంగా బాబు, రామారావు లచ్చు తదితరులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వో ఆకస్మిక తనిఖీ



రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో భాస్కర్ నాయక్

దుమ్ముగూడెం, జూలై 21: పర్ణశాల పీహెచ్‌సీని డీఎంహెచ్‌వో భాస్కర్ నాయక్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని, ర్యాపిడ్ ఫీవర్ సర్వే చేపట్టాలని, వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం పర్ణశాలను సందర్శించి వరద ఉధృతిని పరిశీలించారు. డీఐఓ బాలాజీ నాయక్, డాక్టర్ నాగరాజు, హెచ్ఏ నాగేశ్వరావు పాల్గొన్నారు.

'ఆర్య వైశ్యులు అన్నిరంగాల్లో రాణించాలి'



సంఘం నూతన కమిటీని సన్మానిస్తున్న కూనంనేని

కొత్తగూడెం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యులు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలని ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. లక్ష్మీదేవిపల్లి మండలంలో ఓ ఫంక్షన్ హాలులో ఆదివారం జరిగిన ఆర్యవైశ్య సంఘం నూతన కమిటి ప్రమాణ స్వీకారోత్సవ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, జడ్పీటీసీ కంచర్ల చంద్రశేఖర్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పోరేషన్ చైర్మన్ కాల్వ సుజాత, సంఘ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్షుడు దారా రమేష్ పాల్గొన్నారు.

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

కొత్తగూడెం సాంస్కృతికం, జూలై 21: గురు పౌర్ణమిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబా ఆలయాల్లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. గట్టాయిగూడెం, భక్తాంజనేయస్వామి వారి ఆలయంలో వేణు అయ్యగారి నేతృత్వంలో ఆదివారం బాబా వారికి ప్రత్యేక పూజలు జరిపారు. కొత్తగూడెంలో విద్యానగర్‌లోని సాయిబాబా ఆలయం, మొర్రేడువాగు సమీపంలోని సాయిబాబా, హెడ్డాఫీస్ సమీపంలోని సాయిబాబా ఆలయంలో వేడుకలు నిర్వహించారు. గురుపౌర్ణమిని పురస్కరించుకుని పెద్ద ఎత్తున బాబాకి ప్రత్యేక పూజలు జరిపారు. విద్యానగర్‌లోని సాయినాధునికి అభిషేకం చేసి ఆలయంలో శివలింగాకృతిలో జ్యోతిలింగార్చన చేశారు. విద్యానగర్ సాయిబాబ ఆలయంలో పూలమాలల అలంకరణలో సాయినాధుని విశేష అలంకరణ చేశారు. గురుపౌర్ణమిని పురస్కరించుకుని పెద్ద ఎత్తున బాబా వారిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం కాపా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని సీనియర్ బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కిలారు నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారులు, భక్తులు పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా పలు ఆలయాల్లో గురు పౌర్ణమిని నిర్వహించారు.



సీతారామ ప్రాజెక్టుపై భారీ ఉద్యమం: కూనంనేని

ఇల్లెందు టౌన్, జూలై 21: సీతారామ ప్రాజెక్టు ద్వారా భద్రాద్రి జిల్లాకు సాగునీరు అందించే విధంగా రీ డిజైన్ చేసి న్యాయం చేయాలని లేకుంటే జిల్లా వ్యాప్తంగా భారీ ఉద్యమాన్ని చేపడతామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆదివారం ఇల్లెందులో సీతారామ ప్రాజెక్టు సాధన కోసం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టు డిజైన్‌ను తప్పుడు పద్ధతుల్లో రూపొందించారని ఆరోపించారు. కేవలం 1, 2 ప్రాంతాలకే పరిమితమయ్యే విధంగా రూపకల్పన చేయడం సరికాదన్నారు. గత పాలకులు తమ ఇష్టం వచ్చినట్లుగా డిజైన్ రూపొందించడంతో భద్రాద్రి జిల్లాలోని ఇల్లెందు, భద్రాచలం, బూర్గంపాడు తదితర ప్రాంతాలకు తీవ్రమైన అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్టు స్థిరీకరణలోనే ఎక్కువ సాగుభూమి చూపిస్తున్నారని ఆరోపించారు. సీతారామ ప్రాజెక్టు రీ డిజైన్ కోసం కొత్తగూడెంలో త్వరలోనే భారీ ఎత్తున సభ నిర్వహించి ప్రభుత్వానికి తమ డిమాండ్‌ను తెలుపుతామని ప్రకటించారు. ఈ సమావేశంలో ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా, సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, రాష్ట్ర నాయకులు అయిలయ్య, ప్రజాపంథా రాష్ట్ర నాయకులు చంద్రన్న, అరుణ, న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి బాణోత్ ఊక్లా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కూనంనేని

సంక్షేమ బోర్డు ఏర్పాటుచేయాలి

ఇల్లెందు టౌన్, జూలై 21: ఆటో, మోటారు కార్మికులకు భద్రతతో కూడినే సంక్షేమ బోర్డును ఏర్పాటుచేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు ఐ. కృష్ణ, ప్రధానకార్యదర్శి ఆర్. జనార్ధన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఇల్లెందు పట్టణంలో ఆటో అండ్ మోటారు వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర 5వ మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాణాలనుఅరచేతిలో పెట్టుకుని వాహనాలు నడుపుతున్న డ్రైవర్లకు ప్రభుత్వ చట్టాలు ఉరితాడులా మారాయని విమర్శించారు. ఆటో, మోటారు కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటుచేయడంలో పాలకులు వైఫల్యం చెందారని విమర్శించారు. కారోనా కాలాన్ని అడ్డుపెట్టుకుని నరేంద్రమోడీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని విమర్శించారు. మోదీ ప్రభుత్వం పాత చట్టాల పేరుతో కొత్త చట్టాలను తీసుకొచ్చి నూతన మోటారు వెహికిల్ చట్టం మార్పులు చేసిందని పేర్కొన్నారు.